




చరితను.. మార్చేది వీళ్లు!



కుర్రాళ్లోయ్.. కుర్రాళ్లు.. వెర్రెక్కి ఉన్నోళ్లు.. కళ్లాలే లేనోళ్లు.. హద్దులేవి లేనివాళ్లు.. ఆవేశం ఉన్నవాళ్లు.. గతమును పూడ్చేది వీళ్లు.. చరితను మార్చేది వీళ్లు.. కథలై నిలిచేది వీళ్లు.. కలలకు పందిళ్లు వీళ్లు.. వీళ్లేనోయ్ నేటి మొనగాళ్లు.. ప్రస్తుత ఎన్నికలకు ఈ పాట అతికినట్టు సరిపోతోంది. ఎందుకంటే ఈ రాష్ట్ర భవిష్యత్ యువత చేతుల్లోనే ఉంది.. ఈ ఎన్నికల మలుపు తిప్పేది.. గెలుపు వాకిట నిలిపేది యువతే.. ప్రస్తుతం వారి ఓటు కీలకం కానుంది.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో లెక్కలు తీస్తే ఎంత కీలకమో అర్థమైంది.. ప్రస్తుతం మూడో వంతు ఓటర్లు వారే ఉన్నారు. కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరం పార్లమెంటుల పరిధిలో మొత్తం 47.81 లక్షల మంది ఉన్నారు.. ఈ సంఖ్యలో 9.31 లక్షలు యువ ఓటర్లే.. వీరిలో తొలి ఓటు వేసేవారు అధికంగానే ఉన్నారు.. ఈ సమయంలో ఎవరు ఎటు వైపు ఉన్నారనేది అభ్యర్థులకు అంతుచిక్కని ప్రశ్న.. ముఖ్యంగా యువత మనసులో ఏముందో తెలుసుకునేందుకు 18 నుంచి 29 ఏళ్ల మధ్య ఉన్న యువతను ప్రశ్నిస్తే.. మార్పు రావాలి.. కావాలి అంటున్నారు..

యువతరం ఓటెటో.. 2024 తీర్పటు!

- మరో మూడు రోజులు..72 గంటల్లో ఓటరు తీర్పు
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో యువతరం ఓట్లే కీలకం
- ఈ దఫా తొలిసారి ఓటుహక్కు కలిగినది లక్ష మందిపైనే
- కాకినాడ జిల్లాలో 52 వేలు, తూ.గో.జీ 40 వేలు, కోనసీమ 36 వేలు
- మొత్తం ఓటర్లు 47.81 లక్షలు... యువత 9.31 లక్షలకుపైగా
- ఈసారి నిర్ణయాత్మక శక్తి యువతరమే
- జగన్ సర్కారులో నిలువునా దగాపడ్డ యువత
- యువతకు కూటమి మేనిఫెస్టోలో పట్టం



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఓటంటే వజ్రాయుధం.. ప్రజల తలరాతలు మార్చే ప్రభుత్వాన్ని ఎన్నుకోవడానికి లభించే ఒకే ఒక్క అవకాశం.. అధికారం అండతో చెలరేగే నేతల ఆటకట్టించే పాశుపతాస్త్రం.. ధర్మాన్ని కాపాడే ఏ ఒక్క అవకాశాన్ని ఎవరూ వదులుకోకూడదు. ఓటు కూడా అలాంటి ఒక్క అవకాశమే. అలాంటి అవకాశం ఐదేళ్ల తర్వాత మళ్లీ వస్తోంది. మరో మూడు రోజులు.. 72 గంటల్లో అసెంబ్లీ ఎన్నికల ఓటు వేసే సువర్ణావకాశం లభిస్తోంది. ఈనేపథ్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఈ దఫా ఎన్నికల్లో యువతరం ఓటు అత్యంత కీలకం కాబోతోంది. జిల్లాలో ఎప్పుడు ఏ ఎన్నికలు జరిగినా అత్యధికంగా ఉన్న మహిళా ఓటర్లే కీలక నిర్ణేతలుగా మారుతున్నారు. కానీ ఈసారి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తొలిసారి ఓటుహక్కు వినియోగించుకుంటున్న యువత సైతం అత్యంత కీలకంగా మారనున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లోని (నిడదవోలు, కొవ్వూరు, గోపాలపురం సహా) 22 నియోజకవర్గాల్లో 47.81, లక్షల మంది ఓటర్లు ఉన్నారు. అంటే కాకినాడ, రాజమండ్రి, అమలాపురం పార్లమెంటు పరిధిలోని ఓటర్లు వీరు. వీరిలో 1,29,920 మంది వరకు తొలిసారి ఓటు అవకాశం దక్కించుకున్నారు. వీరిలో కాకినాడ జిల్లాలో 52 వేలు, తూర్పుగోదావరి జిల్లాలో 40,509, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 37,411 మంది యువ ఓటర్లు ఉన్నారు. వీరంతా తొలిసారి తమ ఓటు హక్కుతో తీర్పు నివ్వనున్నారు. వీరంతా ఎటువైపు మొగ్గుచూపుతారనేది ఆసక్తిగా మారింది. అటు ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లలో 18 నుంచి 29 యువ ఓటర్లు 9.31 లక్షల మంది వరకు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో సరైన ప్రభుత్వాన్ని ఎంచుకునే అంశంలో వీరి పాత్ర అత్యంత కీలకంగా మారనుంది.



అయితే ఈ దఫా యువతరం ఓటు ఎవరికి అనేది అనేక ఆకాంక్షలతో ముడిపడి ఉంది. గత ఎన్నికల సమ యంలో ఏటా జాబ్ క్యాలెండర్, డీఎస్సీ, పారిశ్రామిక రంగంలో అద్భుత ఉపాధి అవకాశాలు అంటూ జగన్ సర్కారు నమ్మించి ఆనక అధికారంలోకి వచ్చాక యువతను నిలువునా వంచించింది. దీంతో వారంతా వైసీపీ సర్కారుపై తీవ్ర స్థాయిలో ఆగ్రహంగా ఉన్నారు. ఐదేళ్లుగా జాబ్ నోటిఫికేషన్ల నుంచి డీఎస్సీ, ఇతర పోస్టుల వరకు ఏవీ భర్తీ చేయకుండా యువతరాన్ని నట్టేట ముంచారనే అభిప్రాయం వీరిలో వ్యక్తమ వుతోంది. కొత్త పరిశ్రమలు రాక, ఉన్నవాటిని బెదిరించి తరిమేశారన్న ఆగ్రహావేశాలు ఉమ్మడి తూర్పుగో దావరి జిల్లా యువతరాన్ని కుదిపేస్తున్నాయి. ఇదే సరైన ప్రభుత్వాన్ని ఎంచుకోవాలన్న ఆకాంక్ష వైపు నడిపిస్తోంది. జిల్లాలో గడచిన కొన్ని వారాలుగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ల పర్యటనలో యువత ఎక్కడికక్కడ ప్లకార్డులు పట్టుకుని జాబ్ క్యాలెండర్, ఉపాధి అవకాశాలు కావాలంటూ తమ ఆవేదన వ్యక్తం చేసిన తీరు త్వరలో జరగనున్న యువతరం ఓట్ల గమ్యమెటో చాటినట్టయింది. వీరి ఆకాంక్షలకు తగ్గట్టుగానే టీడీపీ కూటమి మేనిఫెస్టోలో ఏటా నాలుగు లక్షల ఉద్యోగాల భర్తీ.. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పన, డీఎస్సీ నోటిఫికేషన్ అనే అంశాలపై తమ పాలనా అజెండాకు రూపకల్పన చేసి యువతరానికి పట్టం కట్టినట్టయింది. యువత ఓట్లు.. తొలి ఓటు వేయబోతున్న టీనేజర్ల ఓట్లు ఎటువెళతాయోనన్న ఆందోళన వైసీపీలో కొట్టొచ్చినట్టు కనబడుతోంది. యువత ఓట్లకు గాలం వేసేందుకు వైసీపీ కూడా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది.

ఐదేళ్లూ.. ఉపాధి ఉఫ్..

- చదువుకున్నా ఉపాధి లేదు... ఐదేళ్లూ నిర్వీర్యం
- ఒక్క ఐటీ ఉద్యోగమూ రాలేదు
- సాఫ్ట్‌వేర్ కొలువుకు బెంగళూరు, హైదరాబాద్
- విభజిత రాష్ట్రంలో ఐటీ కంపెనీల మాటే లేదు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

యువత ఆకాంక్ష ఒకటే.. ఉద్యోగం.. వారి కోరిక ఒకటే.. ఉపాధి.. ఐదేళ్లుగా నోటిఫికేషన్ల కోసం ఎదురుచూపులతోనే కాలం గడిచిపోయింది.సర్కారు కొలువులకు ప్రకటనలు లేవు. చదివినా నయాపైసా ఉపయోగం లేదు. ఐటీ చదివిన పిల్లల పరిస్థితి మరీ దారుణంగా మారింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒక్కటంటే ఒక్కటీ చెప్పుకోదగిన ఐటీ కంపెనీ రాష్ట్రానికి రాలేదు. చంద్రబాబు హయాంలో వచ్చిన ఐటీ కంపెనీలు సైతం మూతబడ్డాయి. హైదరాబాద్‌లో చంద్రబాబు నిర్మించిన హైటెక్ సిటీని తలచుకుంటూ యువత కన్నీళ్లు పెట్టుకున్న సందర్భాలు అనేకం. ఐటీ చదివిన పిల్లలు కొలు వుల కోసం డిగ్రీ సర్టిఫికెట్లు బ్యాగులో పెట్టుకొని పొట్ట చేతపట్టుకొని బెంగళూరు, హైదరాబాద్‌కి వలస వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. ఉన్నతస్థాయి ఉద్యోగాలకు యువత కోచింగ్ సెంటర్లలో మగ్గిపోతోంది. ఇంటి నుంచి డబ్బులు పంపించమని అడగడానికి డిగ్రీలు అడ్డొచ్చి నలిగిపోతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెగా డీఎస్సీ అంటూ సర్కారు దగా చేసింది. మరో వైపు పీజీలు చదివిన వాళ్లతోనూ జగన్ సర్కారు బంతాట ఆడుకొంది. షాపింగ్ మాల్స్ హోటళ్లు తదితర ప్రైవేటు ఉద్యోగాలు నెలకు రూ.10 వేల జీతంతో చేయాల్సిన పరిస్థితిని తీసుకొచ్చింది.దీంతో యువత విసిగిపోయింది. తొలిసారిగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతీ యువకులు 'ఫ్యాను' అంటే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ చదువులకు తగిన ఉపాధి చూపించే పాలకులు కావాలని కోరుకుంటున్నారు. చంద్రబాబు హయాంలో ఎప్పుడూ ఈ ఐదేళ్ల మాదిరి దుస్థితి అనుభవించలేదని వాపోతున్నారు. కాస్త అటూఇటూ అయినా సర్కారీ కొలువులకు నోటిఫికేషన్లు వచ్చేవి.. ఐటీ చదివిన పిల్లలకు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు రాష్ట్రంలోనే దక్కేవని గుర్తు చేసుకుంటున్నారు. మరో వైపు చంద్రబాబు తీసుకొచ్చిన నైపుణ్య శిక్షణ (స్కిల్ డెవలప్ మెంట్) పడకేసింది.చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు నైపుణ్య శిక్షణ ఏర్పాటుచేసి వేలాది మంది వివిధ చేతివృత్తులు, ఉత్పత్తుల తయారీలో తర్ఫీదు ఇచ్చేవారు.యువతకు ఉపాధి లభించేది. అందువల్ల మళ్లీ అలాంటి రోజులు రావాలని యువత కోరుకుంటున్నారు. తొలి సారి ఓటు వేసే కొందరు తమ ఓటు రద్దుగా పోకూడదని, ఈ రాష్ట్రానికి మళ్లీ అన్యాయం జరగకూడదని ఆకాంక్షిస్తున్నారు.

సమాజంలో మార్పు తెచ్చే నేతకే ఓటు



సమాజంలో మార్పు తెచ్చే నాయకుడికే నా తొలి ఓటు. చదువు పూర్తయినా యువతకు ఉద్యోగాలు లభించడం లేదు. దీనిపై ప్రజాప్రతినిధులు దృష్టిపెట్టాలి. మహిళలకు రక్షణ కల్పించే చట్టాలు తేవాలి. సంక్షేమ పథకాల అమలుతోపాటు అభివృద్ధిచేయాలి.
- సంగన ప్రియ, బీటెక్ , పిఠాపురం

ఉద్యోగావకాశాలకు..పక్క రాష్ట్రం వెళ్లా..



నా పేరు మౌనిక. గతేడాది ఇంజనీరింగ్ పూర్తిచేశా. ప్లేస్‌మెంట్లు లేక పక్క రాష్ట్రానికి శిక్షణకు వెళ్లా. అక్కడే ఉద్యోగాన్వేషణలో ఉన్నా.మన రాష్ట్రంలో నాలా చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు ఎక్కడ ఉన్నాయ్.. నాలో ఎంతో మంది పక్క రాష్ట్రంలో ఉంటున్నారు.. నా పేరు లహరిక.. బీఎస్సీ నర్సింగ్ చదువుతున్నా. నాకంటే ముందు చదువుకున్న వారికి కూడా ఉద్యోగాలు లేవని తెలిసి బాధేసింది. చదువుకున్న వారికి ఉద్యోగావకాశాలు కల్పించేందుకు హామీ ఇచ్చింది టీడీపీయే. ఉద్యోగావకాశాలు కల్పించే వారినే ఎన్నుకోవాల్సిన అవసరం ఉంది. - జి.మౌనిక, జి.లహరిక, అక్కాచెల్లెళ్లు, అమలాపురం

భవిష్యత్తుకు భరోసా ఇచ్చేవారికే ఓటు



భవిష్యత్తుకు భరోసా కల్పించే వారికే నా ఓటేస్తా. ఉద్యోగాల కల్పనతో పాటు స్వయం ఉపాధి పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. రాష్ట్రానికి ఆదాయం వచ్చే మార్గాలపై దృష్టి పెట్టాలి.ప్రజాప్రతినిధులు తప్పు చేస్తే శిక్షించేందుకు స్వతంత్ర వ్యవస్థ ఉండాలి.
- గుండారపు శ్యామ్, డిగ్రీ విద్యార్థి, చిట్టోడితోట, పిఠాపురం

నా తొలి ఓటు.. మంచివ్యక్తికే..



సార్వత్రిక ఎన్నికల్లో మొదటి సారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నా. నా ఓటు యువతకు ఉపాధి ఎవరైతే కల్పిస్తానంటారో వారికే వేస్తా. మంచి వ్యక్తిత్వం కలిగి ఉన్న నాయకుడు కావాల నేది నా ఆశ. తొలి ఓటు కాబట్టి ఓటు గుర్తుండిపోయేలా వేస్తా.
- గోపల విజయరాణి, తాడిమళ్ల, నిడదవోలు మండలం

ఉపాధి కల్పించేవారికే ఓటు..



ఉచితాలేకాకుండా అభివృద్ధి చేసేవారికే ఓటువేయాలి. కేవలం ఉచిత పథకాలపై ఆధారపడితే పరాన్నజీవులుగా మారిపోతాం. ఉచిత పథకాలు ఆర్థికాభివృద్ధికి అవరోధం. ఉపాధి మార్గాల ద్వారానే అభివృద్ధి సాధ్యం.ఉపాధి కల్పించే వారికే నా ఓటు.
- నిమ్మకాయల రామ్‌చరణ్, ఇంజనీరింగ్, ముమ్మిడివరం

సమాజంలో మార్పు రావాలి



అవినీతిరహిత పాలన అందించే వారినే పాలకులుగా ఎన్నుకోవాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యం.నోటుకు ఓటు అమ్ముకుంటే ప్రశ్నించేతత్వాన్ని కోల్పోతాం. దీని వల్ల పాలకుల్లో అవినీతి పెరుగుతుంది. ఓటర్లలో మార్పు వస్తేనే సమాజానికి మేలు జరుగుతుంది.
- మట్టా విజయ, బీకాం విద్యార్థిని, ముమ్మిడివరం

సంపదను మనమే సృష్టించుకోవాలి



మన సంపద మనమే సృష్టించుకునే దిశలో ఉండాలి.పాలకులు స్కిల్ డెవలప్ మెంట్ హబ్‌లు ఏర్పాటు చేసి యువతను ప్రోత్సహించాలి. యువతరం ఉపాధి కల్పనకు కృషి చేసే వ్యక్తికే నా ఓటు వేస్తా. ఎవరు వచ్చినా యువతకు ఏదో ఒకటి చేయాలి.
- కదలి త్రిషాభవానీ, బీకాం, రాజుపాలెం, ముమ్మిడివరం

వైసీపీ పాలనలో అంతా నిరుద్యోగులే..



వైసీపీ పాలనలో కంపెనీలు రాక చదువుకున్న యువత అంతా నిరుద్యోగులుగా మారారు. డిగ్రీ చదివి ఉద్యోగం లేక ఖాళీగా ఉన్నా.ఏ ప్రభుత్వం వచ్చినా యువతకు ఉపాధి కల్పించి తమ కాళ్ల మీద తాము నిలబడేలా ప్రోత్సహించాలి.
- కమ్మండి సాయిభగవాన్, మల్లేపల్లి, గండేపల్లి మండలం

సమాజంలో మార్పు తెచ్చే నేతకే ఓటు



సమాజ శ్రేయస్సుకు పాటుపడే వ్యక్తిని ఎన్నుకోవాలి.నిజాయితీగా ఓటు వేసి నీతిమంతులను ఎన్నుకుంటే సమాజానికి మేలు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా అభివృద్ధిని ఆకాంక్షించే వ్యక్తినే ఎన్నుకోవాలి. తద్వారా సుపరిపాలన సాధ్యమవుతుంది.
- విళ్ల శ్రీరేణుక, ఎంబీఏ విద్యార్థి, ముమ్మిడివరం

నేడు పవన్‌కల్యాణ్ రోడ్‌షో

- పిఠాపురం నియోజకవర్గంలో మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్
- ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్న పవన్
- ఉప్పాడలో బహిరంగ సభ

- 7లో

పవన్‌పై ఇదేం కక్ష



అనుమతుల కోసం రాత్రి 11 గంటల వరకు ఎస్పీ ఆఫీస్‌లోనే ఉన్న కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి

- కాకినాడ సిటీలో పవన్‌కళ్యాణ్ పర్యటనకు అధికారుల చిక్కులు
- ప్రచారం చివరి రోజున కాకినాడలో పవన్ రోడ్‌షో, సభకు టీడీపీ, జనసేన దరఖాస్తు
- కానీ అదే రోజు కాకినాడలో ఎమ్మెల్యే ద్వారంపూడి బైక్‌ర్యాలీ ఉందన్న పోలీసులు
- మార్చి ఎనిమిది ప్రాంతాల్లో దరఖాస్తు చేసినా పర్మిషన్ నో
- వైసీపీ ఎమ్మెల్యే అధికార దుర్వినియోగంపై విమర్శలు

- 7లో



మహిళల ఆత్మీయ సమావేశంలో కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం నానాజీ

అభ్యర్థితో.. ఒకరోజు

అటు ప్రచారం.. ఇటు మంతనాలు



సమస్యలపై ఫోన్‌లో మాట్లాడుతున్న నానాజీ

సార్వత్రిక ఎన్నికలకు సమయం సమీపిస్తుండడంతో కాకినాడ రూరల్‌నియోజకవర్గ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరావు(నానాజీ) తన ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రచారం, వ్యూహప్రతివ్యూహాల్లో బిజీగా ఉన్న పంతం నానాజీతో ఆంధ్రజ్యోతి గురువారం 'అభ్యర్థితో ఒకరోజు' కార్యక్రమం నిర్వహించింది. కాకినాడ గొడారిగుంట నివాసంలో ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి ఆయన అరగంటసేపు యోగాభ్యసనాలు వేశారు. అనంతరం స్నానం చేసి 6.30 గంటలకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 7.30 గంటలకు కాఫీ తాగారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తటస్థులు, రిటైర్డు ఉద్యోగులతో మాట్లాడారు. పార్టీలో పలువురి చేరికలు జరగ్గా వారిని ఆహ్వానించారు. ఉదయం 9.30 గంటలకు బయలుదేరి సర్పవరం ఆటోనగర్‌లో పారిశ్రామికవేత్త ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి గైగోలుపాడులో సర్వారాయుడు ఇంటికి వెళ్లి బ్రేక్ ఫాస్ట్ స్వీకరించారు. 11 గంటలకు వలసపాకల గంగరాజునగర్ లోని జనసేన కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సాయంత్రం 5గంటలకు పి.వెంకటాపురం, సర్పవరంగ్రామాల్లో ఎన్నికల ప్రచారం సాగించారు. రాత్రి 10 గంటల వరకు క్షేత్రస్థాయిలో ప్రచారం నిర్వహించి ముగించారు. -వివరాలు 7వపేజీలో..

సూపర్‌సిక్స్ పథకాలతో ఆర్థికాభివృద్ధి

- తుని కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య



తునిలో మాజీ ఎమ్మెల్యే అశోక్‌బాబుతో కలిసి ప్రచారం చేపడుతున్న దివ్య

తుని రూరల్, మే 9: సూపర్‌సిక్స్ పథకాలతో ఇంటిల్లపాదికి ఆర్థిక లబ్ధి చేకూరుతుందని తుని కూటమి అభ్యర్థి యనమల దివ్య తెలిపారు. మాజీ ఎమ్మెల్యే, జనసేన నేత రాజా అశోక్‌బాబుతో కలిసి తునిలో పదో వార్డులో ఆమె విస్తృతంగా పర్యటించి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఓటర్లతో ఆమె మాట్లాడుతూ అపోహలకు తావులేదని, అందరికీ అండగా ఉంటానని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక చొరవ తీసుకుని పట్టణ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానన్నారు. ఆమె వెంట టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులతోపాటు టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఇనుగంటి సత్యనారాయణ, తెలుగు మహిళా జిల్లా అధ్యక్షురాలు, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని, మున్సిపల్ మాజీ చైర్మన్ కుసుమంచి శోభారాణి, టీడీపీ యువనేత యనమల రాజేష్, కొయ్యా శ్రీనుబాబు, చోడిశెట్టి గణేష్, మళ్ల గణేష్, నార్ల రత్నాజీ ఉన్నారు.

యనమల ఆధ్వర్యంలో చేరికలు

తొండంగి, మే 9: రాష్ట్రంలో త్వరలో రాక్షస పాలన అంతమై కూటమి అధికారంలోకి రాబోతోందని, తద్వారా ప్రజాపాలనకు శ్రీకారం జరుగుతుందని టీడీపీ పోలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గురువారం ఆయన కృష్ణాపురం,బెండపూడి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా జనసేన, బీజేపీ నేతలతో కలిసి రోడ్‌షో నిర్వహించారు. కూటమి అభ్యర్థిగా తుని నుంచి పోటీలో ఉన్న యనమల దివ్యను, ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌లను గెలిపించాలన్నారు. కృష్ణాపురం, బెండపూడిల్లో ఆయనకు ప్రజలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు. ఆయన వెంట మోతుకూరి వెంకటేష్,సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి యనమల రాజేష్, కోడ వెంకటరమణ, సాధనాల నూకరాజు, యర్రబ్బు బెండపూడి నాయుడు, వెలుగుల గోపాల కృష్ణ, శివ, బూసాల శ్రీను, కందా శ్రీధర్, అరిగెల నర్సింహమూర్తి ఉన్నారు. కృష్ణాపురం సర్పంచ్ కందా శ్రీధర్‌తోపాటు వంద కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు యనమల సమక్షంలో టీడీపీలో చేరారు. వీరందరికీ కృష్ణాపురంలో ఆయన పార్టీ కండవాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

'బీసీలకు 50ఏళ్లకే పెన్షన్లు'

కోటనందూరు, మే 9: బీసీలకు 50ఏళ్లకే పెన్షన్లు అందిస్తామని తుని నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య అన్నారు. కోటనందూరు మండలం కేఈ చిన్నాయిపాలెంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆమె టీడీపీ, జనసేన, బీజేపీ నేతలతో కలిసి రోడ్డుషో నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, పార్టీ సీనియర్ నేత అంకంరెడ్డి రమేష్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మండలంలోని బొద్దవరంలో జనసేన నేత రాజా అశోక్‌బాబు, బీజేపీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ కూటమి అభ్యర్థుల విజయం కోరుతూ ప్రచారం నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, డి.చినబాబురాజు, రమణ, గెడ్డం కొండయ్యనాయుడు, గోపీ పాల్గొన్నారు.



కోటనందూరు మండలం చిన్నాయిపాలెంలో ప్రచారంలో పాల్గొన్న దివ్య



యువత ఆలోచనా విధానం ప్రగతిశీలంగా ఉంది. వారు ఉచిత పథకాలకు ఆకర్షితులవడం లేదు. ఉపాధి కావాలంటున్నారు..ఉద్యోగాలు కావాలంటున్నారు..పరిశ్రమలు నెలకొల్పాల్సిన అవసరం ఉందంటున్నారు. తాత్కాలిక ప్రయోజనాలు కన్నా శాశ్వతంగా తమ బతుకులు బాగుపడాలని కోరుకుంటున్నారు..

వారు ఏమనుకుంటున్నారో వారి మాటల్లోనే..




కోనసీమ అభివృద్ధి ప్రదాత

జీఎంసీ బాలయోగి

లోక్‌సభ దివంగత స్పీకర్ జీఎంసీ బాలయోగి కోనసీమ చరిత్రలో నిలిచేలా చిరస్మరణీయ అభివృద్ధిని అందించారు. ఎన్నో కీలక ప్రాజెక్టుల సాధనకు ఆయన చేసిన కృషి కోనసీమ ప్రజల మదిలో ఇప్పటికీ మెదులుతూనే ఉంది. తీర ప్రాంత మత్స్యకార గ్రామాలను బాహ్య ప్రపంచానికి అనుసంధానం చేసి వారు నిత్యం ఎదుర్కొనే ఎన్నో సమస్యలను పరిష్కరించారు. ఆయన అభివృద్ధి పథకాలు ప్రతి ఒక్కరి నోటా ఎప్పటికీ వినిపిస్తూనే ఉంటాయి. అటువంటి స్ఫూర్తి ప్రదాత బాలయోగి లోక్‌సభ స్పీకర్ హోదాలో 2002 మార్చి 3న కృష్ణా జిల్లా కొవ్వాడలంక వద్ద హెలికాప్టర్ కూలిన దుర్ఘటనలో మృత్యువాతపడ్డారు. అయినప్పటికీ ఆయన సాధించిన ప్రాజెక్టులు ఆయన రూపంలో కోనసీమవాసులకు నిత్యం దర్శనమిస్తూనే ఉంటాయి.

● అమలాపురం రూరల్

ఎన్నో పనులు..ఎన్నో ప్రాజెక్టులు



యానాం-ఎదుర్లంక వంతెన



చమురు, సహజ వాయువులు పుష్కలంగా ఉండే కోనసీమలో గ్యాస్ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పి వేలాది మందికి ఉపాధి కల్పించారు. కొబ్బరి ఆధారిత పరిశ్రమలతో పాటు ఫ్యాషన్ టెక్నాలజీ ద్వారా కోనసీమ వ్యాప్తంగా వేల మంది మహిళలకు శిక్షణ ఇప్పించారు. తాగునీటి పథకాలను మంజూరు చేయించి ప్రజల దాహార్తి తీర్చారు. ఇలా కోనసీమలో తన ముద్రతో ఉండే ఎన్నో అభివృద్ధి పథకాలను ఆయన ప్రారంభించి ఇక్కడి ప్రజల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారు. ఆయన మరణానంతరం బాలయోగి ఘాట్, స్టేడియం నిర్మించారు. ఆ చెంతనే జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థకు సంబంధించి ఎన్నో భవనాల నిర్మాణం చేపట్టారు. వాటిలోనే వేలాది మంది మహిళలు, నిరుద్యోగులు, వివిధ రకాల శిక్షణలు పూర్తి చేసుకుని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పొందుతున్నారు. అమలాపురంలోని ఫ్యాషన్ టెక్నాలజీ కేంద్రాన్ని అప్పట్లో పలు పర్యాయాలు నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించి... వాటి అభివృద్ధి కోసం ఎన్నో చర్యలు తీసుకున్నారు. నేడు ఆ భవన సముదాయమే జిల్లా కేంద్రమైన అమలాపురంలో కలెక్టరేట్‌గా మారింది. ఇక ఆర్డీవో కార్యాలయాన్ని ఢిల్లీలో పార్లమెంటు భవనం తరహాలో నిర్మించిన ఘనత కూడా ఆయనదే.

బాలయోగి హయాంలో కోనసీమ ఎంతో అభివృద్ధి చెందింది. ఎంపీగా, రాష్ట్ర మంత్రిగా, చివరకు లోక్‌సభ స్పీకర్ హోదాలో ఆయన ఈ ప్రాంతాభివృద్ధికి బంగారు బాటలు వేశారు. ముఖ్యంగా రెండో ప్రపంచ యుద్ధానంతరం తొలగించబడిన కాకినాడ-కోటిపల్లి రైల్వేలైనును పునరుద్ధరింపజేసి ఈ ప్రాంత ప్రజలకు స్పీకర్ హోదాలోనే అంకితమిచ్చారు. ఆ తర్వాత కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్ ప్రాజెక్టు నిర్మాణం కోసం కృషి చేస్తూనే అకాల మృత్యువాతపడ్డారు. ఈ రైల్వేలైన్ ప్రాజెక్టుకు చంద్రబాబు ప్రభుత్వ హయాంలో ఐదేళ్ల కాలంలో కేంద్రం నుంచి సుమారు రూ.వెయ్యి కోట్లను వివిధ దశల్లో విడుదల చేయించారు. అప్పట్లో ఆ నిధులతో గౌతమి గోదావరిపై ముక్తేశ్వరం-కోటిపల్లి మధ్య వారధి నిర్మాణ పనులు శరవేగంగా చేపట్టారు. ఇప్పటికే అమలాపురం వరకు రైల్వేలైన్‌కు భూసేకరణ పూర్తయినప్పటికీ... ఇక్కడి నుంచి నరసాపురం వరకు భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. రైల్వేలైన్ ప్రాజెక్టు విషయంలో వైసీపీ ప్రభుత్వం పెద్దగా శ్రద్ధ చూపలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నామమాత్రంగానే నిధులు విడుదలయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వ వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఒక దశలో పనులు కూడా నిలిచిపోయాయి. ఎట్టకేలకు పనులు ప్రారంభమయ్యాయి.

కామనగరువు నుంచి వెళుతున్న జాతీయ రహదారి



216 హైవేకు బీజం అప్పట్లోనే..

కత్తిపూడి నుంచి నరసాపురం మీదుగా కృష్ణా జిల్లా పామర్రు వరకు వెళ్లే 216 జాతీయ రహదారిని బాలయోగి హయాంలోనే అప్పట్లో కేంద్రం ప్రకటించింది. అయితే ఈ రహదారిని ప్రస్తుతం నాలుగు వరుసల రహదారిగా విస్తరిస్తున్నారు. కత్తిపూడి, కాకినాడ, ముమ్మిడివరం, అమలాపురం, రాజోలు ప్రాంతాల్లో బైపాస్ రహదారుల నిర్మాణం చివరి దశకు చేరుకుంది. గౌతమి నదిపై ఎదుర్లంక-యానాం మధ్య వారధి నిర్మించిన బాలయోగి ఇక్కడి ప్రజలు పడవ ప్రయాణాలకు స్వస్తి పలికేలా చేశారు.



పోలీసులకు నో ఎంట్రీ



పెద్దాపురం, మే 9: ఏ ఎన్నికలైనా ప్రశాంతగా జరగాలంటే పోలీసులలదే కీలక పాత్ర. అభ్యర్థుల ప్రచారాలు, సభలు, ర్యాలీలకు వారి అనుమతులు తప్పనిసరి. పోలింగ్ రోజు ఓటర్లు ప్రశాంతంగా ఓటుహక్కు వినియోగించుకునేలా బందోబస్తు నిర్వహిస్తారు. అయినప్పటికీ పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు వారికి అనుమతి లేదు. పోలింగ్ జరుగుతున్న సమయంలో ఎలాంటి సమస్య వచ్చినా సాధ్యమైనంత వరకూ కేంద్రంలో ఎన్నికల అధికారే సిబ్బందితో ఆయా సమస్యను పరిష్కరించుకుంటారు. శాంతిభద్రతల సమస్య తలెత్తినప్పుడు ఎన్నికల అధికారి పిలిస్తే తప్ప ప్రత్యేక కారణం లేకుండా పోలీసులు బూత్ లోపలికి పోవడానికి అనుమతి లేదు. పోటీ చేసే అభ్యర్థి అయినా ఇంకా ముఖ్యమైన వ్యక్తి ఓటు వేసేందుకు వచ్చినా వారి భద్రత సిబ్బంది మాత్రం పోలింగ్ కేంద్రం బయటనే ఆగాలి. ఎన్నికల

పోలింగ్ స్టేషన్‌లో ఆర్వోదే అధికారం

విధుల్లో ఉన్న సిబ్బందికి ఇబ్బంది కలిగించే ఏపని కూడా ముఖ్యమంత్రిగానీ, మంత్రులు కానీ వారి అనుచరులు కానీ చేయకూడదు. పోటీలో ఉన్న అభ్యర్థి జడ్ ప్లస్ కేటగిరీ రక్షణ ఉన్నా వారి వెంట వచ్చే సిబ్బందిని పోలింగ్ కేంద్రంలోకి అనుమతించరు. మఫ్టీలో ఉన్న భద్రతా సిబ్బంది ఒకరికి మత్రమే అనుమతి ఉంటుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కేబినెట్ మంత్రులు, ఉప ముఖ్యమంత్రులకు భద్రతా సిబ్బంది ఉంటారు. వారి కూడా పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లకూడదు. పదవుల్లో ఉన్నవారు పోలింగ్ కేంద్రంలో ఓటర్లను ప్రభావితం చేసేలా ప్రవర్తించకూడదు. ఎలాంటి మాటలు, సైగలు చేసినా నేరంగా పరిగణిస్తారు.. పోలింగ్ సిబ్బంది రాజకీయ నాయకులు, మంత్రుల మాటలు పట్టించుకోకుండా ఎన్నికల సంఘం ఆదేశాలను మాత్రమే అమలు చేయాలి. ఎన్నికల సంఘం అనుమతి పత్రం ఉంటేనే కేంద్రంలోకి అనుమతించాలి.

మాక్ పోలింగ్



పోలింగ్ ప్రారంభానికి 90 నిమిషాల ముందు ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్

క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ముందుకు..

పెద్దాపురం, మే 9 : పోలింగ్ రోజు అసలైన పోలింగ్ ప్రారంభం కావడానికి 90 నిమిషాల ముందు మాక్ పోల్ నిర్వహిస్తారు. ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో 50 ఓట్లు వేయడం ద్వారా నోటాతో సహా పోటీలోని ప్రతీ అభ్యర్థికి నమోదైన ఓట్లను నిర్ధారిస్తారు. కంట్రోల్ యూనిట్ ఎలక్ట్రానిక్ ఫలితాలు, వీవీ ప్యాట్ స్లిప్‌ల కౌంట్‌ను ఏజెంట్ల సమక్షంలో లెక్కించి చూపిస్తారు. మాక్ పోలింగ్ విజయవంతంగా నిర్వహించినట్లు సర్టిఫికెట్‌ను ప్రిసైడింగ్ అధికారి రిపోర్టులో పొందుపరుస్తారు. మాక్ పోల్ ప్రక్రియ ముగిసిన వెంటనే ఆ డేటాను క్లియర్ చేసేందుకు కంట్రోల్ యూనిట్ (సీయూ) క్లియర్ బటన్‌ను నొక్కుతారు. మాక్ పోల్ ఓట్లను తొలగించిన తర్వాత సీయూల ఓట్లు నమోదు కాలేదన్న విషయాన్ని అక్కడి పోలింగ్ ఏజెంట్లకు ప్రదర్శించి చూపుతారు. ప్రిసైడింగ్ అధికారి అన్ని మాక్‌పోల్ స్లిప్‌లను వీవీ ప్యాట్ స్లిప్ కంపార్టుమెంట్ నుంచి బయటకు తీసి వాటిని మాక్‌పోల్ స్లిప్ అని స్టాంప్ వేస్తారు. అసలైన పోలింగ్ ప్రారంభానికి ముందు ప్రత్యేకంగా సీలు వేసిన నలుపు కవర్‌లో మాక్‌పోల్ స్లిప్పులను ఉంచి పోలింగ్ ఏజెంట్లకు చూపుతారు. మాక్‌పోల్ తర్వాత ఏజెంట్లు సమక్షంలో ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లకు సీలు వేస్తారు. అసలు పోల్ ప్రారంభించే ముందు సీళ్లపై పోలింగ్ ఏజెంట్ల సంతకం తీసుకుంటారు.



కుమారుడు కోసం..

80 ఏళ్ల వయసులో కూడా కుమారుడు కోసం నల్లమిల్లి మూలారెడ్డి సతీమణి సత్యవతి అనపర్తి నియోజకవర్గంలో ప్రచారం నిర్వహిస్తున్నారు. బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోరుతూ తమ స్వగ్రామమైన రామవరంలో మండుటెండలో రిక్షాలో తిరుగుతూ తన బిడ్డను గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థిస్తున్నారు. ● అనపర్తి



తండ్రి కోసం..

ముమ్మిడివరం నియోజకవర్గ కూటమి అభ్యర్థి దాట్ల సుబ్బరాజు చిన్న కుమార్తె కనుమూరి శ్రావ్య, ఆమె భర్త వెంకటసూర్యనారాయణరాజుతో కలిసి ముమ్మిడివరం మండలం లంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సలాదివారిపాలెం, కమిని, పొట్టితిప్ప, వలసల తిప్ప, కొత్తలంక గ్రామాల్లో మేనిఫెస్టోలోని సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు.

● ముమ్మిడివరం

ఆ డబ్బు ఏమైనట్టు..?

పి.గన్నవరం, మే 9: పి.గన్నవరం మండలంలోని ఓ గ్రామంలో గ్రామ ముఖ్య నేత (వైసీపీ నేత) ఇంట్లో ఓటర్లకు పంచేందుకు పార్టీ పంపిన సొమ్ము మాయం అవడంపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. సుమారుగా రూ.9.50 లక్షలు ఇంటిలో సిద్ధం చేయగా ఈనెల 8న ఉదయం నేత ఇంటికి కారులో ముగ్గురు వ్యక్తులు వచ్చి తాము ఎన్నికల తనిఖీ టీమ్‌గా పరిచయం చేసుకుని సోదాలు అనంతరం ఇంట్లో ఉంచిన రూ.9.50 లక్షలను తీసుకువెళ్లారని చెబుతున్నారు. సదరు నేతను జిల్లా కేంద్రంలోని పోలీసు ఉన్నతాధికారి వద్దకు రావాలని వారి వెంట తీసుకువెళ్లారు. కారు అమలాపురం రూరల్ మండల పరిధిలోని వై.జంక్షన్‌కు వెళ్లగానే వైసీపీ నేతను కేసు కావాలా...డబ్బు కావాలా అని భయపెట్టి అక్కడ వదిలేశారని గత రెండు రోజులుగా పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కాగా అప్పు తెచ్చుకుని ఇంట్లో ఉంచిన సొమ్మును ఎన్నికల అధికారులు పేరుతో భయపెట్టి దొంగిలించుకు పోయారని సంబంధిత వైసీపీ నేత పోలీసులు వద్ద వాపోయినట్లు తెలిసింది. పోలీసులు కూడా ఆ వైసీపీ నేత ఇంటికి వెళ్లి పరిశీలన చేయడంతో పాటు పరిసరాల్లో ఉన్న సీసీ కెమెరాలను సైతం పరిశీలించినట్లు సమాచారం. అంతే కాకుండా వైసీపీ నేతలే స్వయంగా రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలన చేసి ఇదంతా చందమామ కథగా ఆపార్టీ నాయకులే అభివర్ణిస్తూ విమర్శలు చేసుకుంటున్నారు. కాగా ఆ వైసీపీ నేత పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయలేదని తెలిసింది. ఈ పరిణామంతో ఆ పార్టీ నేతలను అదే పార్టీలో పూర్తిగా నమ్మే స్థితిలో లేరని పలువురు చెప్పుకుంటున్నారు.



గెటప్ శ్రీను ప్రచారం

అంబాజీపేట, మే 9: కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు మేలు జరుగుతుందని జనసేన పార్టీ స్టార్ క్యాంపెయినర్ గెటప్ శ్రీను అన్నారు. పి.గన్నవరం అసెంబ్లీ కూటమి అభ్యర్థి గిడ్డి సత్యనారాయణకు మద్దతుగా పుల్లేటికుర్రులో గురువారం ఆయన ప్రచారం నిర్వహించారు. సినిమా డైలాగులతో ఓటర్లను ఆకట్టుకున్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతిని ప్రజలకు వివరించారు.

నిస్వార్థ నాయకుడు కావాలి



నిస్వార్థంగా ప్రజలకు సేవచేసే నాయకుడు కావాలి. ఎటువంటి క్రిమినల్ బ్యాక్‌గ్రౌండ్‌లేని నాయకుడు అయితే ప్రజలకు చక్కని పరిపాలనందించగలడు. నిరుద్యోగుల సమస్యలు తీరుస్తూ ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చాలి. నేను వేయబోయే మొదటి ఓటును అటువంటి నాయకుడిని ట్యూన్ చేసుకుని వేయాలనుకుంటున్నాను.

ముమ్మితి లతాశ్రీ, కాకినాడ నగరం

మంచి చేసే నాయకుడికే ఓటు



నేను ఓటు నమోదు చేసుకున్న తర్వాత వేయబోయే తొలి ఓటు ఒక ఇంజనీరింగ్ విద్యార్థిగా ప్రస్తుత రాజకీయాలపై నాకు కొంచెం అవగాహన ఉంది. కాబట్టి రాష్ట్రానికి మంచి చేస్తారనుకునే నాయకుడికే ఓటు వేయాలనుకుంటున్నా. గత రాజకీయాలకు ప్రస్తుత రాజకీయాలకు చాలా తేడా కనిపిస్తుంది. ప్రలోభాలకు లోనుకాకుండా ప్రజలకు మంచి చేసే నాయకుడికి మాత్రమే ఓటు వేస్తాను.

దేవారపు రాజేష్, కాకినాడ నగరం

యువతకు అవకాశం ఇవ్వాలి



వారసత్వ రాజకీయాలకు స్వస్తిపలికి యువతకు అవకాశం ఇవ్వాలి. ప్రతి ఒక్కరు నిజాయితీగా ఓటువేయాలి. గ్రామీణ ప్రాంతంలో నాణ్యమైనా విద్య వైద్యం అందేలా చర్యలు చేపట్టాలి. రైతులకు సాగునీరు అందేలా గ్రామాల్లో చెరువులు తవ్వించాలి. నా తొలి ఓటు విజన్ ఉన్న నాయకుడికే. మంచి నాయకుడే మంచి పరిపాలన అందిస్తాడనే పూర్తి నమ్మకం నాకుంది. అలాంటి నాయకుడినే నేను ఎన్నుకుంటా..

యగదాసు పావని, బలరామపురం, రౌతులపూడి

ఉద్యోగ, ఉపాధి కల్పనకే ఓటు



విద్య, ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చే నాయకుడిని ఎన్నుకోవాలని ఉంది. ఉద్యోగాల కోసం యువత హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. ఆ నగరాలకు ధీటుగా మన రాష్ట్రంలోనే ఉద్యోగ, ఉపాధి కల్పన చేసే నేతకు నా తొలి ఓటు వేయాలని నిర్ణయించుకున్నా. మన రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉంది. ఆ సమస్యను పరిష్కరించే నాయకుడినే ఎన్నుకోవాలి..

- రామకుర్తి చంద్ర సిద్దార్థ, గొల్లప్రోలు

యువతపై దృష్టి సారించాలి



తొలిసారి ఓటు వేయబోతున్నా. విజయవాడలో బీటెక్ సెకండియర్ చదువుతున్న నేను ఓటు వేసేందుకు వేమగిరి వచ్చాను. ఏ ప్రభుత్వాలైనా యువతకు ప్రాధాన్యం ఇవ్వాలి. యువతకు ఉద్యోగాలు కల్పించాలి. పరిశ్రమలు రావాలి. అభివృద్ధితోపాటు అన్నివర్గాల ప్రజలకు మేలు జరగాలి. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఏ పదవి లేకుండానే రైతుల సంక్షేమంకోసం పాటుపడ్డారు. అలాంటి నాయకులకు నా ప్రాధాన్యం.

సూరపురెడ్డి లిఖితగోపాల్, వేమగిరి, కడియం మండలం

అభివృద్ధికే నా ఓటు



మొదటిసారి ఓటు వేయబోతున్నా. పార్టీలు, కులాలు ముఖ్యం కాదు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుంది. తద్వారా రాష్ట్ర అభివృద్ధి జరుగుతుంది. రాష్ట్రాన్ని నిజాయితీగా అభివృద్ధి చేసేవారికే నా ఓటు. యువత దృష్టి అంతా ఉద్యోగాలు, ఉపాధి కల్పన సాధించే నాయకుడు ఎవరనే దానిపై ఉండాలి. ఏ పార్టీ అయినా అటువంటి వారికే ఓటు వేయాలి.. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది.

గణేశుల వీరగంగారామ్ ధనుష్, ఇంజనీరింగ్ విద్యార్థి, ముమ్మిడివరం

భవిష్యత్తుకు బాట వేసే నేత కావాలి



నేను తొలిసారి ఓటెయ్యబోతున్నా. యువత కలలను సాకారం చేసేలా పాలకులు ప్రాజెక్టులు, ఉపాధి వనరులు కల్పించాలి. ఉపాధి కల్పనకు ప్రణాళికలు రూపొందించాలి. సంక్షేమం పేరుతో ప్రజలకు డబ్బులు పంచడం సరికాదు. యువశక్తిని వినియోగించుకునేలా భావితరాలకు బంగారుబాట వేసే వారికే నా ఓటు వేస్తాను. యువత అంతా అభివృద్ధికి బాటలు వేసే నాయకుడినే ఎన్నుకోవాలి..

గనిశెట్టి శివభరత్, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం

భవిష్యత్తు కోసం ఓటేస్తా



చదువుకున్న వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవు. ఇంజనీరింగ్ పూర్తి చేసిన లక్షలాది మంది పడుతున్న బాధలను కళ్లారా చూశా. సొంత రాష్ట్రంలో ఉద్యోగ అవకాశాలు ఏ ప్రభుత్వం కల్పించగలదో మాకు తెలుసు. నిరుద్యోగులు, యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని తొలిసారి ఓటేస్తా. ఉన్న ప్రాంతంలో ఉద్యోగ కల్పన జరిగితే అన్ని కుటుంబాలు ఆనందంగా ఉంటాయి. పొరుగు రాష్ట్రాల్లో ఉద్యోగం ఎంత కష్టమో తెలుసు..

పెద్దిరెడ్డి లక్ష్మణేష్, అమలాపురం

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలి



నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా కల్పించాలి. తద్వారా రాష్ట్రం అభివృద్ధి చెందడంతోపాటు నిరుపేద కుటుంబాలు ఆర్థికంగా బలపడతాయి. నేను తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నా. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, ఉద్యోగాలు కల్పించడంతోపాటు అభివృద్ధి, సంక్షేమం అందించే పార్టీకే నా ఓటు. నా దృష్టి భవిష్యత్తుపైనే ఉంది. యువతకు భవిష్యత్తు కల్పించే నాయకుడిపైనే ఉంది.

వాస్కూరి పవన్‌ఈశ్వరుడు, లంకలగన్నవరం, పి.గన్నవరం

యువత నిర్వీర్యమవుతోంది..



లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ కళాశాలల్లో డిగ్రీలు, ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజిమెంట్ చదువులు పూర్తిచేస్తున్నా బయటకు వచ్చాక తగిన ఉద్యోగావకాశాలు, స్వయం ఉపాధి అవకాశాలుకానీ కల్పించే ఆలోచన ప్రభుత్వం చేయకపోవడంతో యువత నిర్వీర్యమైంది. డిగ్రీల పట్టాలు చేతబట్టి ఏళ్లు గడుస్తున్నా కనుచూపుమేరలో యువత ఆశలు ఫలించే అవకాశాలు లేవు. ఇది ముమ్మాటికీ పాలకప్రభుత్వాల వైఫల్యమే. రానున్న ప్రభుత్వాలు ఈ విషయంలో సమగ్రమైన ప్రణాళికలు రూపొందించాలి

యరజర్ల విజయకుమార్, ప్రైవేట్ ఉద్యోగి, వేట్లపాలెం, సామర్లకోట మండలం

కార్పొరేషన్(కాకినాడ)/ రౌతులపూడి/ గొల్లప్రోలు/ ముమ్మిడివరం/ ఉప్పలగుప్తం/అమలాపురం/పిగన్నవరం/సామర్లకోట

'రాష్ట్రంలో కూటమిదే అధికారం'

కాకినాడ సిటీ, మే 9: రాష్ట్రంలో అధికారం మార్పు తప్పదని, అవినీతి వైసీపీ ప్రభుత్వం పోయి మహా కూటమి అధికారంలోకి వస్తుందని జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు అన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో కూటమి నేతలు గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్య మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ అరాచకాల సీఎం జగన్‌కు రాజకీయ ముగింపు పలకాలని, కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి అక్రమాలను కాకినాడ ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. బహుజన నాయకుడు వీజీఆర్ నారగోని మాట్లాడుతూ రాష్ట్రంలో గంజాయివల్ల యువత తప్పుదారి పడుతోందన్నారు. వీరిని కాపాడాలంటే పవన్ ఆశయాలవల్లే సాధ్యమవుతుందన్నారు. జనసేన నాయకులు నల్లం శ్రీనివాస్, దాసరి కిరణ్ మాట్లాడుతూ అనంతపురానికి చెందిన సందీప్ రాయల్ అనే యువకుడ్ని చేరదీసి ఆదరిస్తే వైసీపీ నాయకులు అతడితో పవన్‌కళ్యాణ్‌పై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారన్నారు. బీజేపీ నాయకుడు ఏడిద కృష్ణ, టీడీపీ నాయకుడు కొల్లా బత్తుల అప్పారావు మాట్లాడుతూ కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబును ఎమ్మెల్యేగా, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌ను గెలిపించాలని కోరారు.

చెట్లు నరికేస్తున్నారు!

● సీఎం రాకతో నరికివేత ● పిల్లల ఆట స్థలంలో హెలిప్యాడ్‌పై విమర్శలు


డివైడర్‌పై చెట్లను నరికేసిన దృశ్యం

పిఠాపురం, మే 9: జగన్ వస్తున్నారంటే అంతా విధ్వంసమే. సారు రాక కోసం అప్పుడే చెట్లు నరికివేత ప్రారంభమయింది. పట్టణంలో ఉన్న ఒక క్రీడా మైదానంలో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఇప్పుడు అక్కడ పిల్లలు ఆడుకునే అవకాశం లేకుండా చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం జగన్ ఈనెల 11వ తేదీన పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. ఆ రోజున ఉప్పాడ సెంటర్‌లో జరిగే బహిరంగ సభలో పాల్గొననున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి పాతబస్టాండు మీదుగా ఉప్పాడ సెంటర్ వరకూ గల డివైడర్‌పై ఉన్న చెట్ల కొమ్మలను గురువారం మధ్యాహ్నం నరికివేశారు. వాటిని తొలగించి అక్కడ నుంచి తరలించారు. ఉప్పాడ సెంటర్‌లో పలు చెట్ల కొమ్మలు తొలగించారు. ఇప్పుడు జగన్ రాక కోసం పట్టణంలోని ఆర్‌ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ కళాశాల క్రీడామైదానంలో హెలిప్యాడ్ నిర్మించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఇదొక్కటే క్రీడామైదానం ఉంది. ఇప్పుడు ఈ మైదానంలో కాంక్రీటుతో హెలిప్యాడ్ నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణం వలన భవిష్యత్తులో ఇక్కడ క్రీడలు ఆడుకునే అవకాశాన్ని విద్యార్థులు, క్రీడాకారులు కోల్పోనున్నారు. జగన్ హెలిప్యాడ్ కోసం క్రీడామైదానాన్ని పనికి రాకుండా చేయడం ఏమిటని క్రీడాభిమానులు ప్రశ్నిస్తున్నారు.

లక్ష ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు

ప్రముఖ సినీ హీరో శివాజీ



సమావేశంలో మాట్లాడుతున్న హీరో శివాజీ తదితరులు

కొవ్వూరు, మే 9: ఎన్‌ఆర్‌ఐ టీడీపీ ఆధ్వర్యంలో వెస్టన్ దేశాల్లో లక్ష ఉద్యోగాలు అందించనున్నట్టు సినీ హీరో శివాజీ చెప్పారు. ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ లక్ష ఉద్యోగాలు కల్పనే లక్ష్యం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ విదేశాల్లో తాము కల్పించేవి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు కావని, ఉపాధ్యాయ, వ్యవసాయరంగంలో ఉద్యోగాలన్నారు. అక్కడికి వెళ్లేవారికి భాషకు ఇబ్బంది లేకుండా ఎన్‌ఆర్‌ఐ టీడీపీ ఆధ్వర్యంలో 4 నెలలు శిక్షణ అందిస్తామన్నారు. ఏపీలో జాబ్ క్యాలెండర్ మర్చిపోతున్న తరుణంలో ఎన్‌ఆర్‌ఐ టీడీపీ నిరుద్యోగ యువతకు లక్ష ఉద్యోగాలు కల్పన కార్యక్రమానికి తాను వలంటీరుగా వచ్చానన్నారు. ఆసక్తి కలిగిన యువతీయువకులు ఎన్‌ఆర్‌ఐ టీడీపీ డాట్‌కామ్ స్లాష్ ఇంటర్నేషనల్ జాబ్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. కొంతమంది ఎన్‌ఆర్‌ఐలు సమూహంగా ఏర్పడి లక్ష ఉద్యోగాలు కల్పిస్తుంటే ప్రభుత్వం ఇంకెంత చేయాలన్నారు. ఉపాధ్యాయులను మద్యం షాపుల వద్ద నిలబెట్టిన ఘనుడు జగన్‌రెడ్డికి ఉద్యోగం విలువ ఏంతెలుసన్నారు. హైదరాబాద్‌లో కూర్చుని కొంతమంది డిబేట్‌లు, ఇంటర్వ్యూల పేరుతో ఏపీపై విషం చిమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి జగన్ కబ్జా చేశారని, లాండ్ టైటిలింగ్ చట్టం దుర్మార్గమన్నారు. వైజాగ్‌లో అపరిమిత సంపద ఉందని, అందుకే మాట్లాడితే వైజాగ్ వెళ్లిపోతానంటున్నారని అన్నారు. మే 13వ తేదీతో జగన్మోహనరెడ్డి ఖాళీ అయిపోతారని, ఇకనైనా సీబీఐ కేసులపై విచారణ చేపట్టాలని న్యాయమూర్తులను దేశ పౌరుడిగా కోరుతున్నానన్నారు. మే 13 తర్వాత జగన్ లండన్ వెళ్లిపోవడానికి సిద్ధమవుతున్నారన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటు కూటమి అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కుమారుడు హితేష్ మాట్లాడుతూ కొత్త పరిశ్రమలు రాలేదని, ఉన్న పరిశ్రమలు పక్క రాష్ట్రాలకు తరలివెళ్లిపోయాయని, జాబ్ క్యాలెండర్ లేదని అన్నారు. సీబీఎన్ ఫోరం సభ్యురాలు పాతూరి సునీత మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి యువతను అన్నివిధాల మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండున్నర లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారని, ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ అన్నారని, ఏదీ అమలు చేయలేదన్నారు. ఫీజురీయింబర్స్‌మెంటు ఇవ్వకపోవడంతో కళాశాల యాజమాన్యాలు చదువు పూర్తయిన విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందించడం లేదన్నారు. దీంతో హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల్లో చాలీచాలని జీతాలతో టెలీ కాలర్స్‌గా యువత పనిచేస్తున్నారన్నారు. ఎన్‌ఆర్‌ఐ టీడీపీ సభ్యులు ఎం.అనీల్, సతీష్, వేమూరి అరవింద్, మీడియా కోఆర్డినేటర్ దొడ్డపనేని సాగర్, సూరపనేని చిన్న, బీవీ ముత్యాలరావు, దాయన రామకృష్ణ, మద్దిపట్ల సురేష్ పాల్గొన్నారు.

అభ్యర్థితో.. ఒకరోజు

ఓ వైపు ఎన్నికల ప్రచారం..

మరోవైపు మంతనాలు

» కాకినాడ రూరల్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీతో 'అభ్యర్థితో ఒకరోజు'

సర్పవరం జంక్షన్, మే 9: సార్వత్రిక ఎన్నికలకు సమయం రోజుల్లోకి సమీపిస్తుండడంతో కాకినాడరూరల్ నియోజకవర్గ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరావు(నానాజీ) తన ప్రచారాన్ని మరింత ముమ్మరంచేశారు. ఎన్నికల ప్రచారం, వ్యూహప్రతివ్యూహాల్లో బిజీలో ఉన్న పంతం నానాజీతో ఆంధ్రజ్యోతి గురువారం 'అభ్యర్థితో ఒకరోజు' నిర్వహించింది.


ఉదయమే విశ్వబ్రాహ్మణ సంఘ సభ్యుల వినతిపత్రాన్ని చదువుతూ..

యోగాతో ప్రారంభమై..

కాకినాడ రూరల్ కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) గొడారిగుంటలోని తన స్వగృహంలో ఉదయం 5.30 గంటలకు నిద్రలేచి అరగంట సేపు యోగభ్యసనాలు, వ్యాయామం చేశారు. స్నానం తర్వాత 6.30 గంటలకు పూజా కార్యక్రమాలు పూర్తిచేసుకుని 7.30 గంటలకు కాఫీ తాగారు. అప్పటికే తనను కలిసేందుకు విచ్చేసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు, తటస్థులు, రిటైర్డు ఉద్యోగులతో మాట్లాడారు. విశ్వబ్రాహ్మణ మండల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రామోజు లక్ష్మణరావు, జీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సభ్యులను పార్టీలో చేర్చుకున్నారు. తూరంగి శివారు డ్రైవర్స్‌కాలనీకి చెందిన పెనిమిజ్జి స్వప్న ఆధ్వర్యంలో 50మంది మహిళలు పార్టీలో చేరగా వీరికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఉదయం 9.30 గంటలకు బయలుదేరి సర్పవరం ఆటోనగర్‌లో పారిశ్రామికవేత్త ఇంటికి వెళ్లారు. అక్కడి నుంచి గైగోలుపాడులో సర్వారాయుడు ఇంటికి వెళ్లి అల్పాహారం స్వీకరించారు. అరగంటసేపు వారితో చర్చల తర్వాత వలసపాకల గంగరాజునగర్‌లోని జనసేన కార్యాలయం వద్దకు 10గంటలకు విచ్చేశారు.

జయలక్ష్మి సొసైటీ డైరెక్టర్లతో సమావేశం


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న పంతం నానాజీ

ఉదయం 10.15గంటల నుంచి 11 గంటల వరకు జయలక్ష్మి కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం సభ్యులతో సమావేశమయ్యారు. బాధితుల తరపున కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రూ.582కోట్ల ఆర్థిక కుంభకోణంపై జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్ బాధితులకు భరోసా కల్పించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. చట్టబద్ధంగా ప్రభుత్వంనుంచి రావాల్సిన అనుమతులు అన్నీ సత్వరంగా రప్పించి న్యాయం చేస్తామన్నారు. సొసైటీ ఛైర్మన్ గంగిరెడ్డి త్రినాథరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆత్మీయ సమావేశం


పి.వెంకటాపురంలో దివ్యాంగురాలికి నమస్కరిస్తూ..

ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు మహిళలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. టీడీపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉమ్మడి మేనిఫెస్టోలో పేర్కొన సంక్షేమ పథకాలన్నింటినీ మహిళలకు అమలు చేస్తామన్నారు. ఈ సందర్భంగా 49వ డివిజన్‌కు చెందిన శెట్టిబలిజ సామాజికవర్గం నాయకుడు పాలిక రమణ నేతృత్వంలో పాలిక రమేష్, పాలిక వీరభద్రరావు, నాగదుర్గ ఆధ్వర్యంలో 250మంది మహిళలు, మాజీ వలంటీర్లు ఆయన సమక్షంలో పార్టీలో చేరారు. 12.30 గంటలకు తిమ్మాపురానికి చెందిన జనసేన నాయకుడు మాదారపు తాతాజీ ఆధ్వర్యంలో వైసీపీ సీనియర్ నాయకుడు కొండపల్లి పుత్రయ్యను జనసేనలోకి చేర్చుకున్నారు. ఆయనలాంటి సీనియర్ నేతలు పార్టీలోకి రావడం శుభసూచికమన్నారు.

రోడ్‌షో.. ఇంటింట ప్రచారం


సాయంత్రం రోడ్‌షోలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పంతం నానాజీ

మధ్యాహ్నం 12.30 గంటల నుంచి 1.30 గంటల వరకు వివిధగ్రామాల నుంచి విచ్చేసిన తటస్థులు, రిటైర్డు ఉద్యోగస్తులతో మంతనాలు సాగించారు. హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉంటున్న ఓటర్లతో ఫోన్లలో సంభాషించారు. రాష్ట్రాభివృద్ధి కోసం, ప్రజాశ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కోరారు. అనంతరం 1.30 గంటల నుంచి 2 గంటల వరకు ప్రముఖులతో ఏకాంతంగా చర్చలు జరిపారు. అనంతరం కార్యాలయం నుంచి బయలుదేరి గొడారిగుంట నివాసానికి చేరుకున్నారు. అక్కడ అరగంటసేపు నాయకులతో సంభాషణలు సాగించారు. 3 గంటలకు భోజనం చేసిన తర్వాత గంటసేపు విశ్రాంతి తీసుకున్నారు. 5గంటలకు ఇంటినుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో బయలుదేరి పి.వెంకటాపురం, సర్పవరం గ్రామాల్లో రోడ్డుషో, ఇంటింటా ప్రచారం నిర్వహించారు. రాత్రి 10గంటల వరకు ప్రచారం నిర్వహించారు. రాత్రి 11 గంటలకు ఇంటికి చేరుకుని 12 గంటల వరకు మంతనాలు సాగించి ఇంట్లోకి వెళ్లిపోయారు.

నేడు పవన్‌కల్యాణ్ రోడ్‌షో

మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్స్..ఉప్పాడలో బహిరంగ సభ

పిఠాపురం/పిఠాపురం రూరల్/కొత్తపల్లి, మే 9: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో రోడ్‌షో నిర్వహించనున్నారు. మూడు చోట్ల స్ట్రీట్‌కార్నర్ మీటింగ్‌ల్లో పవన్ ప్రజలనుద్దేశించి ప్రసంగించనున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం మండలం కుమారపురంలోని గోకులం గ్రాండ్‌లో గురువారం జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయకుమార్, పిఠాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావులు వెల్లడించారు. 10వ తేదీ ఉదయం 9 గంటలకు పిఠాపురం మండలం చిత్రాడ నుంచి పవన్ రోడ్‌షో ప్రారంభమవుతుంది. అనంతరం 216వ జాతీయ రహదారి మీదుగా పిఠాపురం ఎంపీడీవో కార్యాలయం పక్క నుంచి జగ్గయ్యచెరువు కాలనీలోకి వెళ్లి అక్కడ రాజీవ్‌గృహకల్ప అపార్ట్‌మెంట్లు, సామర్లకోట రోడ్డు, పాదగయ, తహసీల్దారు కార్యాలయం సెంటర్ మీదుగా పాతబస్టాండు, ఉప్పాడ బస్టాండు సెంటర్‌కు చేరుకుని అక్కడ జరిగే స్ట్రీట్‌కార్నర్ సమావేశంలో మాట్లాడతారు. అనంతరం కోటగుమ్మం, మార్కెట్, చర్చి సెంటర్, ఆర్టీసీ బస్‌కాంప్లెక్సు, అగ్రహారం, పశువుల సంత మీదుగా రోడ్‌షో కొనసాగి గొల్లప్రోలు పట్టణంలోకి ప్రవేశిస్తుంది. గొల్లప్రోలులోని మెయిన్‌రోడ్డు, పాతబస్టాండు, రాయవరం సెంటర్, రామాలయం, పల్లపువీధి, ఎంపీడీవో కార్యాలయం, ఈబీసీ కాలనీ మీదుగా రోడ్‌షో ఉంటుంది. అక్కడ జరిగే సమావేశంలో పవన్ ప్రసంగించనున్నారు. గొల్లప్రోలు, చేబ్రోలులో రోడ్‌షో అనంతరం మధ్యాహ్నం 3గంటలకు విరామం తీసుకుంటారు. తిరిగి సాయంత్రం 4గంటలకు చేబ్రోలు నివాసం నుంచి పవన్ బయలుదేరి ఏకే, ఏపీ మల్లవరం గ్రామాల మీదుగా రమణక్కపేట, కోనపాపపేట, మూలపేట, అమీనాబాదు గ్రామాల మీదుగా ఉప్పాడ చేరుకుంటారు. అక్కడ రాత్రి 7గంటలకు జరిగే బహిరంగ సభలో ప్రసంగించి కొత్తపల్లి, యండపల్లి, కొండెవరం, నవఖండ్రవాడ గ్రామాల మీదుగా మరలా రాత్రి 10 గంటల సమయానికి పిఠాపురం చేరుకుంటారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పిఠాపురంలో పవన్ విజయం ఇప్పటికే ఖరారయిందని, మెజార్టీపైనే ఇప్పుడు అందరి దృష్టి ఉందని తెలిపారు. వైసీపీ ఎన్ని కుట్రలు పన్నినా పవన్ గెలుపును ఎవ్వరు అడ్డుకోలేరని స్పష్టం చేశారు. సమావేశంలో జనసేన నాయకులు తోలేటి శిరీష, పిల్లా శివశంకర్, జ్యోతుల సతీష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన ట్రైనీ ఐపీఎస్‌లు



కలెక్టరేట్(కాకినాడ), మే 9: ఎన్నికల నిర్వహణలో భాగంలో కాకినాడ జిల్లాకు 8మంది శిక్షణ ఐపీఎస్ పోలీసు అధికారులు గురువారం శిక్షణ కలెక్టర్ భావన, ఎస్పీ సతీష్ కుమార్‌లతో కలిసి కలెక్టర్ జె.నివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జాతీయ పోలీసు అకాడమీలో శిక్షణలో ఉన్న ఐపీఎస్ అధికారులు కాకినాడ జిల్లా ఎన్నికల విధుల్లో భాగస్వామ్యం కానున్నారన్నారు. స్పందన హాల్లో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్‌ను శిక్షణ ఐపీఎస్‌లు సందర్శించారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య అధికారులకు కంట్రోల్ రూమ్‌లోని సువిధ, 1950 కాల్‌సెంటర్, అకౌంటింగ్ టీం, సీ-విజిల్, మీడియా ప్రసారాలు, చెక్‌పోస్ట్ వెబ్ కాస్టింగ్, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ బృందాలు పనితీరు వివరించారు.

రాష్ట్రంలో కూటమి గెలుపు తథ్యం



కాకినాడ 8వ డివిజన్‌లో పర్యటిస్తూ ప్రచారం సాగిస్తున్న వనమాడి కొండబాబు, ప్రజలకు మేనిఫెస్టో వివరిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, మే 9: ధరలను విపరీతంగా పెంచి ప్రజల సొమ్మును దోచుకున్న వైసీపీ ప్రభుత్వాన్ని తరమికొట్టేందుకు ఆంధ్ర రాష్ట్ర ప్రజలు ఎదురు చూస్తున్నారని, రాష్ట్రంలో కూటమి గెలుపు తథ్యమని కాకినాడ సిటీ అసెంబ్లీ టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం 8వ డివిజన్‌లో పర్యటించి ఓటు అభ్యర్థించారు. కొండబాబు మాట్లాడుతూ కాకినాడ అభివృద్ధిని, ప్రజల సంక్షేమాన్ని విస్మరించి అక్రమ సంపాదనే ధ్యేయంగా ఎమ్మెల్యే ద్వారంపూడి పాలన సాగించాడన్నారు. ఖాళీ జాగా కనిపిస్తే చాలు కబ్జా చేయడమే ద్వారంపూడి పనిగా పెట్టుకున్నాడన్నారు. వైసీపీ పాలనంతా అవినీతిమయం గా సాగిందని... ఇసుక, మద్యం, గనులు, భూములు, మట్టి ఇలా ప్రతిదానిలో అవినీతికి పాల్పడ్డారన్నారు. నగర అభివృద్ధికి, ప్రజల సంక్షేమానికి సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను, గ్లాసు గుర్తుపై ఓటు వేసి ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కేతా శ్రీనివాస రావు, సంగిశెట్టి అశోక్, డివిజన్ నాయకులు సీకోటి అప్పలకొండ, బోనేపల్లి శ్రీనివాస్, సీకోటి చక్రరావు, బడే సత్యారావు, చొక్కా బాబురావు, తాళ్లూరి కామేష్, శీలం శ్రీనివాస్, పప్పు సూర్యనారాయణ, నక్కా మణికంఠ పాల్గొన్నారు.

వివిధ డివిజన్ల నుంచి చేరికలు

వివిధ డివిజన్ల నుంచి పలువురు గురువారం కొండబాబు నివాసం వద్ద టీడీపీలో చేరారు. వారికి కాకినాడ సిటీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. 9వ డివిజన్‌లో కొండబాబు కోడలు డాక్టర్ వనమాడి హనీషా పర్యటించి ఎన్నికల ప్రచారం సాగించారు.

కాకినాడ సిటీ అభ్యర్థి వనమాడి కొండబాబు

సుంకర పావని ప్రచారం

కాకినాడ సిటీ అసెంబ్లీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబుకు సైకిల్ గుర్తుపైన, కాకినాడ పార్లమెంట్ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గ్లాసు గుర్తుపైన ఓటు వేసి గెలిపించాల్సిందిగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుంకర పావని తిరుమల కుమార్, మాజీ కార్పొరేటర్ బలువూరి రామకృష్ణ పాల్గొన్నారు.


టీడీపీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న వనమాడి


ప్రజలను ఓటు అభ్యర్థిసున్న కొండబాబు కోడలు డాక్టర్ హనీషా

కష్టం విలువ తెలిసిన వాడిగా ప్రజల కోసం పనిచేస్తా

» రానున్నది కూటమి ప్రభుత్వమే
» వైసీపీ పాలకులకు సంపద ఉంది సంస్కారం లేదు
» కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్


కొబ్బరి బొండాలు తాగుతున్న ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు


రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న కూటమి ఎంపీ అభ్యర్థి ఉదయ్

కార్పొరేషన్(కాకినాడ), మే 9: ప్రజల కష్టం విలువ తెలిసిన వాడిగా ప్రజలకోసం పనిచేస్తానని కాకినాడ పార్లమెంటు నియోజకవర్గ కూటమి అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ అన్నారు. జగ్గంపేట అసెంబ్లీ కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూతో కలిసి గురువారం ఆయన జగ్గంపేట నియోజకవర్గం కిర్లంపూడి మండల గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి ఎన్డీఏ కూటమితోనే సాధ్యమన్నారు. పవన్‌కల్యాణ్, చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం ఎంతో అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తుందన్నారు. గత చంద్రబాబు పాలనలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధిస్తే 2019 ఎన్నికల తర్వాత వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం దోపిడీకి గురైందన్నారు. ఇలాంటి పరిస్థితులనుంచి తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలంటే కూటమికి ప్రజలు పూర్తిగా ఓట్లు వేసి గెలిపించాలన్నారు. జగ్గంపేటలోని ప్రతి సమస్య తెలుసుకున్నానని అవగాహన ఉందన్నారు. ముఖ్యంగా జగ్గంపేట నియోజకవర్గంలో తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ చేపట్టి రైతులకు నిరంతరాయంగా సాగునీటిని అందించేందుకు కృషిచేస్తానన్నారు. మల్లవరం ముసురుమిల్లి ప్రాజెక్టు నిర్మాణం పూర్తిచేస్తామన్నారు. పురుషోత్తపట్నం ఫేజ్-2 పనులు మళ్లీ పునఃప్రారంభించి మెట్టప్రాంతాలైన జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, పిఠాపురం ప్రాంతాలకు సాగునీటిని అందిస్తామన్నారు. కిర్లంపూడిలో డిగ్రీ కాలేజీ నిర్మాణానికి అన్నివిధాలుగా సహకరిస్తానని కిర్లంపూడి ప్రజలకు హామీ ఇచ్చారు. జగ్గంపేట ఎమ్మెల్యేగా నెహ్రూ గెలిచిన తర్వాత ఆయనతో కలిసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందించుకున్నానని ఉదయ్ శ్రీనివాస్ అన్నారు. ఉదయంనుంచి సాయంత్రం వరకు జరిగిన ప్రచారంలో ఎండను సైతం లెక్కచేయకుండా తలకు పసుపు తలపాగా కట్టుకుని ఉత్సాహభరితంగా ప్రచారంలో పాల్గొన్నారు. ప్రజలకు అభివాదం చేస్తుంటే మహిళలు ఎదురొచ్చి హారతులిచ్చి ఉదయ్ శ్రీనివాస్‌కు నీరాజనాలు పలికారు. మధ్యలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్‌తో ప్రచారంపై పలు అంశాలు మాట్లాడుకుంటూ ముందుకు సాగారు. ఎండనుంచి ఉపశమనం కోసం ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు ఇద్దరూ కొబ్బరిబొండాలు తాగుతూ ప్రచారం చేపట్టారు.


జగ్గంపేట మండలం కిర్లంపూడిలో తంగెళ్ల ఉదయ్‌కు హారతులిస్తున్న మహిళ

ఉద్యోగాల కల్పనలో వైసీపీ విఫలం: నాగబాబు


నాగబాబును కలిసిన వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పిఠాపురం, మే 9: చదువుకున్న యువతకు ఉద్యోగాల కల్పనలో వైసీపీ ప్రభుత్వం విఫలమైందని జనసేన అధినేత కె.నాగబాబు విమర్శించారు. పిఠాపురంలో నాగబాబును ఆంధ్రప్రదేశ్ వెటర్నరీ స్టూడెంట్స్ అండ్ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం నాగబాబును కలిసి సమస్యలు వివరించారు. నాగాబాబు మాట్లాడుతూ పవన్‌కల్యాణ్ యువతకు ఉపాధి,ఉద్యోగాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తారని చెప్పారు.

జనసేనలో చేరికలు

వైసీపీకి చెందిన గొల్లప్రోలు మండలం తాటిపర్తి ఎంపీటీసీ గుండవరపు నూకరాజు ఆ పార్టీకి రాజీనామా చేశారు. గురువారం నాగబాబు సమక్షంలో నూకరాజుతో సహా 120మంది జనసేన పార్టీలో చేరారు. పిఠాపురానికి చెందిన స్వర్ణకార సంఘం సభ్యులు నియోజకవర్గ జనసేన కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు సమక్షంలో జనసేనలో చేరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మందారపు సంతోష్, వెన్నపు చక్రధరరావు, పెంకే జగదీష్, కారపురెడ్డి మణికంఠ తదితరులు పాల్గొనగా, చేరిన వారిలో మారోజు శ్రీనివాస్, చేబ్రోలు రాంబాబు, కె.శరభలింగం, వీరమళ్ల శ్రీనివాస్, కొమ్మోజు గుణశేఖర్ ఉన్నారు.

పవన్‌కు మద్దతుగా న్యాయవాదుల ర్యాలీ

పిఠాపురంనుంచి కూటమి అభ్యర్థిగా పోటీచేస్తున్న పవన్‌కల్యాణ్‌కు మద్దతుగా పట్టణంలో గురువారం న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో న్యాయవాదులు నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి వర్మ ప్రచారం

కొత్తపల్లి, మే 9: పిఠాపురం కూటమి అభ్యర్థి పవన్ విజయం కోరుతూ కుతుకుడుమిల్లి, వాకతిప్ప గ్రామాల్లో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీ ఎస్ఎన్ వర్మ సతీమణి లక్ష్మీదేవి వర్మ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. టీడీపీ నాయకులు రెడ్నం దొరబాబు, జనసేన నాయకులు రావు అక్షయ్ ఉన్నారు.

పోలింగ్ స్టేషన్లవద్ద ప్రథమ చికిత్సా కేంద్రాల ఏర్పాటు

జీజీహెచ్(కాకినాడ), మే 9: ఈనెల 13న ఎన్నికలు జరగనున్నందున ముందుజాగ్రత్తగా జిల్లావ్యాప్తంగా ఉన్న పోలింగ్‌స్టేషన్లవద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ జె.నరసింహనాయక్ గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాఎన్నికల అధికారి(కలెక్టర్) జె.నివాస్ ఆదేశానుసారం జిల్లావ్యాప్తంగా 892 పోలింగ్ లొకేషన్స్‌లో 1640 పోలింగ్ కేంద్రాల వద్ద ప్రథమ చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు డీఎంహెచ్ఓ వెల్లడించారు. అన్ని ప్రథమ చికిత్సా కేంద్రాలవద్ద పూర్తిస్థాయిలో పారామెడికల్ సిబ్బంది విధులు నిర్వర్తిస్తారన్నారు. కేంద్రాల్లో 25 రకాల అత్యవసర మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసినట్టు పేర్కొన్నారు.

కాకినాడ
• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట
www.andhrajyothy.com


న్యాయ మూర్తికి వేదాశీర్వచనం

హైకోర్టు న్యాయమూర్తి పూజలు

అన్నవరం, మే 9: సత్యదేవుడి సన్నిధిలో గురువారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాండవ కిరణ్మయి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు.

వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలి

జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట/కిర్లంపూడి, మే 9: వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడి ఇంటికి సాగనంపాలని జగ్గంపేట కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. గురువారం మండలంలోని సింహాద్రిపురం గ్రామం నుంచి బైక్ ర్యాలీగా కదులుతూ నెహ్రూ, కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ చైతన్యరథంపై నిలుచుని ప్రజలకు అభివాదం చేస్తూ ప్రచారం చేపట్టారు. టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ ఎన్నికల అబ్జర్వర్ తోట నవీన్ నేతృత్వంలో జగపతినగరం, చిల్లంగి, కిర్లంపూడి, ముక్కొల్లు, రామకృష్ణాపురం, రాజుపాలెం, వీరవరం, రామచంద్రపురం ప్రచారం ఉత్సాహభరితంగా సాగింది. కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

టీడీపీలో చేరికలు

కిర్లంపూడి మండలంలోని ముక్కొల్లు టీడీపీ సీనియర్ నాయకులు బస్వా వీరబాబు స్వగృహంలో సూరంపాలెం టీడీపీ నాయకులు పోసిన బాబురావు ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన మాదిగ దండోరా 40 కుటుంబాలు టీడీపీలో చేరారు. వారికి జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి సాదరంగా స్వాగతం పలికారు. కుంచే రామకృష్ణ, గల్లా కృష్ణమాధవ్, మేడిశెట్టి నారాయణరావు, తాతపూడి బాబురావు పాల్గొన్నారు.

గండేపల్లి: గండేపల్లిలో యాదవ సంఘం నాయకులు లంజపల్లి శ్రీనివాస్, రామకృష్ణ ఆధ్వర్యంలో యాదవసంఘం సభ్యులు సుమారు వందమందికిపైగా టీడీపీలో చేరారు. వారికి జ్యోతుల నెహ్రూ కండువాలు కప్పి ఆహ్వానించారు. మల్లేపల్లిలో చిక్కాల బ్రదర్స్ ఆధ్వర్యంలో 30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఎస్వీఎస్ అప్పలరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, పరిమిబాబు, వెలమాటి కాశీ, వెంపాటి రాజు, బొల్లంరెడ్డి రామకృష్ణ,సత్తిబాబు ఉన్నారు.



చైతన్య రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న నెహ్రూ, పార్టీ శ్రేణులతో కలిసి ప్రచారం చేస్తున్న దృశ్యం




టీడీపీలో చేరినవారితో జ్యోతుల నెహ్రూ, ప్రచారంలో కొబ్బరినీళ్లు తాగుతూ నెహ్రూ ఉపశమనం, నెహ్రూ కుమారుడు నవీన్‌కుమార్‌తో ఎంపీ అభ్యర్థి ఉదయ్‌శ్రీనివాస్

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు
సమన్వయంతో పనిచేయాలి

పెద్దాపురం, మే 9: ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సమన్వయంతో ఎన్నికల అధికారులంతా అంతా కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అన్నారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సెక్టార్, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెక్టోరియల్ అధికారులు తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో పోలింగ్ సామాగ్రీ పంపిణీ పోలింగ్ ముందు రోజు తీసుకోవాల్సిన చర్యలపై ఎన్నికల సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈనెల 13న పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా సెక్టోరియల్ అధికారులు కృషి చేయాలన్నారు. అలాగే ప్రతీ సెక్టోరియల్ అధికారికి 19 నుంచి 12 పోలింగ్ కేంద్రాలు కేటాయించామని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఎఫ్ఎస్టీ బృందాలతో కలిసి ప్రత్యేకంగా తనిఖీలు చేయాలన్నారు. అనంతరం లూథరన్ హైస్కూల్లో జరుగుతున్న ఓపీవోల శిక్షణను పరిశీలించారు. ఆర్వో జె.సీతారామారావు తదితరులు ఉన్నారు.



పెద్దాపురం సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

పారదర్శకంగా విధులు నిర్వహించాలి

సర్పవరం జంక్షన్, మే 9: ఓటింగ్ ప్రక్రియపై సమగ్ర అవగాహనతో పోలింగ్ విధులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ జె.నివాస్ కోరారు. ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్లో ఎన్నికల విధానం, నిర్వహణపై ఓపీవోలకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్వో ఇట్ల కిషోర్, విజయప్రసాద్ తదితరులున్నారు.

వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలి

రాష్ట్ర కాపు జేఏసీ నేతల పిలుపు

కాకినాడ సిటీ, మే 9: అన్ని సామాజికవర్గాలను మోసం చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలని, మహాకూటమిని అధికారంలోకి తీసుకురావాలని రాష్ట్ర కాపు జేఏసీ నేతలు పిలుపునిచ్చారు. కాకినాడలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం మీడియా సమావేశంలో రాష్ట్ర కాపు జేఏసీ నేతలు మాట్లాడుతూ కాపులతోపాటు ఇతర కులాలు, వారి కులాల అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కార్పొరేషన్లను జగన్ ప్రభుత్వం ఏ నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిందన్నారు. కూటమి తరపున పోటీ చేస్తున్న కాపు సామాజిక అభ్యర్థుల గెలుపు కోసం 45రోజుల క్రితం తిరుపతిలో ప్రారంభించిన ప్రచార యాత్ర 45 అసెంబ్లీ, 25 పార్లమెంట్ స్థానాల్లో పర్యటించి నేటితో పూర్తయ్యిందన్నారు. అనంతరం ప్రచార యాత్రను విజయవంతం చేసిన జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసును కాపు నాయకులు అభినందించారు. మహాకూటమికి చెందిన కాపు నేతలు వాసిరెడ్డి ఏసుదాసు, గట్టి సత్యనారాయణ, నల్లం శ్రీనివాస్, ఆకుల రామకృష్ణ, రంబాల వెంకటేశ్వరరావు, అడబాల సత్యనారాయణ, చిక్కాల దొరబాబు, బాజిబోయిన వెంకటేష్‌నాయుడు పాల్గొన్నారు.

'వైసీపీని ఓడించాలి'

సర్పవరం జంక్షన్, మే 9: కాపులను వెన్నుపోటు పొడిచిన వైసీపీ పార్టీని ఓడించాలి, త్రీమేన్ కమిటీ ఏమైందో ఎమ్మెల్యే కన్నబాబు చెప్పాలని, కూటమి ప్రభుత్వానికి మద్దతు పలకాలని కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు పిలుపునిచ్చారు. రమణయ్యపేట దాసు నివాసంలో విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు ఆరేటి ప్రకాశ్, ఆకుల రామకృష్ణ మాట్లాడారు. బీజేపీ నాయకులు రంబాల వెంకటేశ్వరరావు, కాళ్ల ధనరాజు, అడబాల సత్యనారాయణ, తాతాజీ ఉన్నారు.

వేట నష్టపరిహారాన్ని పెంచేందుకు కృషి : దాట్ల

తాళ్లరేవు, మే 9: గ్యాస్‌కంపెనీలు సముద్రంలో పైపులైను పనులు చేసే సమయంలో మత్స్యకారులకు ఇచ్చే వేట నష్టపరిహారాన్ని పెంచేందుకు కృషిచేస్తానని ముమ్మిడివరం కూటమి అభ్యర్థి దాట్ల బుచ్చిబాబు అన్నారు. గురువారం కోరింగ పంచాయతీ పెదబొడ్డు, చినబొడ్డువెంకటాయపాలెం, చొల్లంగి, లచ్చిపాలెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ నేతలు వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాసరావు, పెమ్మాడి కృష్ణవేణిల ఆధ్వర్యంలో దాట్ల బుచ్చిబాబు, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌లకు ప్రజలు పూలనీరాజనాలతో ఘన స్వాగతం పలికారు. ప్రతీ ఒక్కరూ సైకిల్‌గుర్తులపై ఓట్లువేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, టీడీపీ నేతలు పొన్నమండ రామలక్ష్మి, మాజీ ఎంపీపీ టేకుమూడి అనంతలక్ష్మి, సర్పంచ్ కోరుకొండ సింహాద్రమ్మ, టేకుమూడి లక్ష్మణరావు, మందాల గంగ సూర్యనారాయణ, ధూళిపూడి వెంకటరమణ పాల్గొన్నారు. వైసీపీ పాలనపై విసుగుచెందిన సుంకరపాలెం సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు టీడీపీలో చేరారు. కోరింగ పంచాయతీ సీతారామపురం, ప్రతాప్‌నగర్ గ్రామపెద్దలు, ప్రజలు దాట్లతో గ్రామ అభివృద్ధిపై చర్చలు జరిపి టీడీపీలో చేరారు. చేరిన వారిలో పెయ్యల శ్రీనివాసరావు, కొత్తపల్లి అప్పారావు, మోకా విష్ణుప్రసాద్, దడాల భైరవమూర్తి, శ్రీనివాసరావు ఉన్నారు.


ప్రచారంలో బుచ్చిబాబు, హరీష్‌కు హారతులిస్తున్న మహిళలు

అధికారంలోకి వచ్చేది కూటమి ప్రభుత్వమే : వర్మ

పిఠాపురం, మే 9: రాష్ట్రంలో టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి అధికారంలోకి వచ్చి ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్నదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీకి చెందిన మున్సిపల్ విద్యాకమిటీ చైర్మన్ మైనవరపు ఈశ్వరరావు వైసీపీని వీడి గురువారం టీడీపీలో చేరారు. ఈశ్వరరావు, తదితరులకు వర్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వర్మ మాట్లాడుతూ అరాచక, విధ్వంస పాలన సాగిస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.


టీడీపీలోకి ఈశ్వరరావును ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

టీడీపీలో చేరిక

పిఠాపురం మండలం .పి.దొంతమూరు గ్రామానికి చెందిన వైసీపీ పంచాయతీ వార్డు సభ్యుడు రాసంశెట్టి లోవరాజు, మిత్రబృందం తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరందరికి వర్మ టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రవివర్మ, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఆద్యుడు చంద్రబాబే : రాజప్ప

పెద్దాపురం కూటమి అభ్యర్థి చినరాజప్ప

సామర్లకోట, మే 9: రాష్ట్రంలో సంక్షేమ పాలనకు ఆద్యుడు చంద్రబాబేనని పెద్దాపురం కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం రాత్రి సామర్లకోట పట్టణంలోని 5,6,7 వార్డులలో దళితవాడలు, బ్రౌన్‌పేట, కుమ్మరి వీధి, తోటవారి వీధి, పాత తహశీల్దార్ కార్యాలయం రోడ్డు, చంద్రశేఖరస్వామి ఆలయం పోవు రోడ్డు తదితర ప్రాంతాల్లో కూటమి పార్టీల నాయకులు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతో కలిసి విస్తృతంగా ప్రచా రం నిర్వహించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా నిలిచిపోయి వైసీపీ పాలనతో రాష్ట్రం పూర్తిగా నిర్వీర్యం అయ్యిందన్నారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం చంద్రబాబు ఎంతగానో కృషిచేశారన్నారు. ఎస్సీలకు ఏ,బీ,సీ,డీ వర్గీకరణ అమలు చేయడం వల్ల రాష్ట్రంలో 22 వేలమందికి ఉద్యోగావకాశాలు లభించాయన్నారు. ఎస్సీలు కూటమి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలన్నారు. పలు కూడలిల్లో మహిళలు మంగళహారతులతో రాజప్పకు నీరాజనాలు పలికారు.



సామర్లకోట ప్రచారంలో చినరాజప్ప, మంగళహారతి ఇస్తున్న మహిళ

రాక్షస పాలనకు చరమగీతం పాడాలి

పెద్దాపురం, మే 9: రాష్ట్రంలో వైసీపీ రాక్షసపాలనకు చరమగీతం పాడాలని పెద్దాపురం టీడీపీ కూటమి అభ్యర్థి నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో ఆయన జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబుతో కలసి ప్రచారం చేపట్టారు. ముందుగా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు వారికి పూలమాలలు, హారతుల ఇచ్చి ఘనస్వాగతం పలికారు. రాజప్ప మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కనుమరుగైందన్నారు. మెట్ట రైతులను నట్టేట ముంచిందన్నారు. ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ ఆలోచించి ఓటువేయాలన్నారు. ఐదేళ్లగా వైసీపీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకున్నారని.. రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటే కూటమికి అధికారం ఇవ్వాలన్నారు. తుమ్మల బాబు మాట్లాడుతూ వైసీపీకి ఓటువేస్తే ప్రజ లు మళ్లీ నష్టపోవాల్సి వస్తుందన్నారు. కూటమిని ప్రజలు బాగా ఆదరిస్తున్నారని, రాబోయేది కూటమి ప్రభుత్వమే అని, వైసీపీకి ఓటమి ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజలు తమ భవిష్యత్తు, తమ పిల్లల బాగుకోసం కూటమికి పట్టం కట్టాలన్నారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బోళ్ల వెంకటరమణ, దువ్వా రాజా పాల్గొన్నారు.



పెద్దాపురం మండలం కొండపల్లిలో ప్రచార కార్యక్రమంలో చినరాజప్ప, ప్రచారంలో మాట్లాడుతున్న దృశ్యం

వైసీపీకి గుణపాఠం తప్పదు

ప్రత్తిపాడు కూటమి అభ్యర్థి వరుపుల సత్యప్రభ

ప్రత్తిపాడు, మే 9: జరగబోయే ఎన్నికల్లో టీడీపీ కూటమిదే విజయమని ప్రజల చేతుల్లో వైసీపీకి గుణపాఠం తప్పదని, ప్రత్తిపాడు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సత్యప్రభ రాజా చెప్పారు. గురువారం ప్రత్తిపాడులో ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ కార్యాలయం వద్ద నుంచి చైతన్యరథంపై ప్రచారాన్ని కొనసాగించారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చిపూలమాలతో ఘన స్వాగతం పలికారు. అభిమానులు, కార్యకర్తలు గజమాలతో సత్కరించారు. సత్యప్రభ మాట్లాడుతూ వైసీపీ అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపి రాష్ట్రం అభివృద్ధి సాధించడానికి కూటమి ప్రభుత్వానికి అవకాశం ఇవ్వాలన్నారు. కూటమి అధికారంలోకి వస్తేనే అధ్వాన్నంగా మారిన రాష్ట్రం అభివృద్ధి పథంవైపు నడిచి సుభిక్షంగా ఉంటుందన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ యాళ్ళ విశ్వే శ్వరరావు, మూరి వరప్రసాద్, టీడీపీ నాయకులు అమరాది వెంకట్రావు, యాళ్ళ జగదీష్, చలంకూరి భాను, అంబటి బుజ్జి, ముత్యాల రాంబాబు, శెట్టిబత్తుల వీరబాబు, వెలుగుల నాని, పోలిశెట్టి శ్రీను, రావూరి తాతాజీ, అంబటి రాంబాబు,లాయర్‌మధుబాబు, జనసేన నేత గోపిశెట్టి శ్రీను, బీజేపీ నాయకుడు సింగిలిదేవ్ సత్తిరాజు పాల్గొన్నారు.


ఏలేశ్వరంలో ప్రచారం చేస్తున్న సాయితర్షిత్

కూటమి అభ్యర్థులను గెలిపించండి

ఏలేశ్వరం, మే 9: ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను గెలిపించాలంటూ పట్టణంలో 15వ వార్డులో వరుపుల సత్యప్రభ కుమారుడు వరుపుల శ్రీసాయితర్షిత్ ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. ఈనెల 13వ జరిగే ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి పోటీచేస్తున్న వరుపుల సత్యప్రభకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి పోటీ చేస్తున్న తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్‌కు గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, మూది నారాయణ స్వామి, అలమండ చలమయ్య, శిడగం శివ, కిలారి రామచంద్రరావు, బాబ్జి, చల్లా గణేష్, వీరవెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిక

రౌతులపూడి, మే 9: రాజవరం ఎంపీటీసీ సోమరౌతు సీతారామ స్వామి (నాని)తో పాటు 30 కుటుంబాలు కూటమి అభ్యర్థి సత్యప్రభ సమక్షంలో ప్రత్తిపాడు టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీలో చేరారు. కార్యక్రమంలో జిగిరెడ్డి శ్రీను, పర్వత సుభాష్, రాంకుర్తి బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడులో సత్యప్రభకు భారీ గజమాలతో స్వాగతం


ప్రచారంలో సత్యప్రభకు మహిళల కరచాలనం


రౌతులపూడి: టీడీపీలోకి ఎంపీటీసీని ఆహ్వానిస్తున్న సత్యప్రభ

సూపర్ సిక్స్ పథకాలతో వెలుగులు


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, మే 9: అన్ని వర్గాల ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసిన సీఎం జగన్ పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, రాబోయేది కూటమి ప్రభుత్వమని, నిరుపేదల జీవితాల్లో సూపర్ సిక్స్ పథకాలు వెలుగులు నింపుతాయని కాకినాడ రూరల్ జనసేన కూటమి అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. గురువారం పి.వెంకటాపురం, సర్పవరం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు పెంకే సోమరాజు, పుల్ల శ్రీరాములు, చైర్మన్ శ్రీను, రాందేవు సీతయ్యదొర, నందిపాటి త్రిమూర్తులు, బావిశెట్టి ప్రసాద్, నందపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'కూటమిని ప్రజలు గెలిపించాలి'

వేళంగి (కరప), మే 9: రాష్ట్రాభ్యున్నతి కోసం కలిసిన కూటమిని గెలిపించడానికి ప్రజలందరూ సహకరించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, పార్టీ కాకినాడ రూరల్ కో-ఆర్డినేటర్ పిల్లి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి విజ్ఞప్తి చేశారు. వేళంగిలో ప్రచారాన్ని నిర్వహించారు. కూటమి కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే అభ్యర్థి పంతం నానాజీకి గాజు గ్లాసు గుర్తుపై ఓటేయాలని కోరారు. ఆయా పార్టీల నాయకులు చుండ్రు వెంకన్నరాయ చౌదరి, వెలుగుల లచ్చారావు, మేడిశెట్టి పట్టాభి, కంటే సత్తిబాబు, కాకర్ల బుజ్జిబాబుచౌదరి, యాసలపు విష్ణు ఉన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

జగ్గంపేట, మే 9: పట్టణంలోని కాకినాడరోడ్డులో నూతన టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. సత్తి సదాశివరెడ్డి ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టారు. జడ్పీ మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్, జ్యోతుల సుబ్బారావు, మణిబాబు, జీను రాంబాబు, పాండరంగ రాంబాబు, మారిశెట్టిభద్రం, దేవరపల్లి మూర్తితో పాటు పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

నల్లమిల్లి ఎన్నికల ప్రచారం

కాకినాడ సిటీ, మే 9: అనపర్తి నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి గురువారం పెదపూడి మండలం కరకుదురులో జోరుగా ఎన్నికల ప్రచారం సాగించారు. అడుగడుగునా మహిళలు, గ్రామస్థులు హారతులిస్తూ నల్లమిల్లికి ఘన స్వాగతం పలికారు. ఎన్డీఏ శ్రేణులు పాల్గొన్నారు.


ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నల్లమిల్లి


సమీక్ష నిర్వహిస్తున్న ఎస్పీ

చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలి

కాకినాడ క్రైం, మే 9: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల్లో ధైర్యాన్ని నింపి స్వేచ్ఛగా ఓటు వేసే విధంగా భరోసాను కల్పించే ప్రత్యేక దళాలు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్రమణి సతీష్‌కుమార్ కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో గురువారం ఆయన సీఐఎస్ఎఫ్, రాజస్థాన్ స్టేట్ ఆర్మ్‌డ్ పోలీస్(ఆర్ఎస్ఏపీ) అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 13న ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు, ప్రజలందరికీ రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

వ్యక్తికి తీవ్ర గాయం

సామర్లకోట, మే 9: పట్టణ పరిధిలో పెన్షన్‌లైన్ పోవు రోడ్డు కూడలి వద్ద సత్తెమ్మ ఆలయం సమీపాన రెండు వర్గాల మధ్య గురువారం రాత్రి చిన్న వివాదం చిలికి చిలికి ఘర్షణలకు దారి తీసింది. ప్రత్యర్థి వర్గం కర్రలతో దాడి చేయడంతో పెన్షన్ లైన్‌కు చెంది కె.బాగ్యరాజు తలకు తీవ్రగాయమైంది. ముగ్గురు తనపైకి కర్రలతో దాడిచేసి గాయపరిచారని బాగ్యరాజు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. అతడిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సామర్లకోట కేసు పోలీసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండూరు రిజర్వాయర్‌లో పడి పంపు ఆపరేటర్ మృతి

సర్పవరం జంక్షన్, మే 9: పండూరు రిజర్వాయర్ చెరువులో ప్రమాదవశాత్తూ పడి పంపు ఆపరేటర్ మృతి చెందిన సంఘటన గురువారం జరిగింది. కొత్తపల్లి మండలం వాకతిప్ప సతీష్‌చంద్ర కాలనీకి చెందిన సిద్ధి దుర్గాప్రసాద్ (38) కాకినాడ రూరల్ పండూరు తాగునీటి పథకం వద్ద పంపు ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉండగా ప్రమాదవశాత్తూ రక్షిత పథకానికి నీరందించే రిజర్వాయర్ చెరువులో పడిపోయాడు. సహచర సిబ్బంది వెంటనే పోలీసులు, నిర్వాహకులకు సమాచారం అందించడంతో వలలు తీసుకొచ్చి చెరవులో గాలించగా, దుర్గాప్రసాద్ మృతదేహం కనిపించింది. తిమ్మాపురం ఎస్ఐ ఎంవీవీ రవీంద్రబాబు మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో కత్తులతో దాడి

రౌతులపూడి, మే 9: శృంగవరంలో యువకులు మద్యం మత్తులో కత్తులతో దాడి చేసుకున్నారు. ట్రైనీ డీఎస్పీ ఈశ్వర సాయియశ్వంత్, ఎస్ఐ అబ్దుల్ నబీ తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం బడే కొండబాబు, మద్దలనాగు, నల్లమల్లి శ్రీను ఎస్సీకాలనీలో మద్యం తాగి మత్తులో కత్తులతో దాడి చేసుకున్నారు. కొండబాబుకు తీవ్ర గాయాలవ్వగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మిగతా ఇద్దరికి గాయాలు కాగా తుని తరలించి కేసు నమోదు చేశామని తెలిపారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పళ్లంరాజు ప్రచారం

కాకినాడ సిటీ, మే 9: పార్లమెంట్ పరిధిలోని పలు నియోజక వర్గాల్లో కాకినాడ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లిపూడి మంగపతి పళ్లంరాజు ఎన్నికల ప్రచారం సాగించారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలకుగాను 6 నియోజకవర్గాల్లో అభ్యర్థులతో కలిసి ఇప్పటికే ఆయన ఒక దఫా ప్రచారం పూర్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో పనులు చేసుకునే వారిని, బస్సుల్లో ప్రయాణిస్తున్న వారిని కలిసి ఓట్లు అభ్యర్థించారు. శుక్రవారం పెద్దాపురంలో ప్రచారం సాగించనున్నారు. 11, 12 తేదీల్లో బూత్ ఏజెంట్లతో సమావేశాలు నిర్వహించి 13న ఎన్నికలకు సిద్ధం చేయనున్నారు. ప్రచారంలో ఏఐసీసీ సభ్యుడు మల్లిపూడి రాంబాబు క్రియాశీలకంగా వ్యవహరిస్తూ శ్రేణులను సమాయత్తం చేస్తున్నారు.


బస్సులో ఓట్లు అభ్యర్థిస్తున్న పళ్లంరాజు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని మూడురోడ్ల కూడలిలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ కాకినాడ ఎంపీ అభ్యర్థి పళ్లంరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీసీసీ సభ్యుడు దర్నాల కోట శ్రీను, కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు, ఓబీసీ రాష్ట్ర కార్యదర్శి కొల్లు వీరగణేష్ ఉన్నారు.

'ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులకు సెలవు ఇవ్వాలి'

కాకినాడ సిటీ, మే 9: ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులందరికీ ఈనెల 14న ప్రత్యేకమైన సాధారణ సెలవు మంజూరు చేయాలని ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు కోరారు. ఎన్జీవో హోంలో గురువారం ఆయన మాట్లాడారు. 12, 13 తేదీల్లో పూర్తిగా ఎన్నికల విధుల్లో ఉంటారని, అందువల్ల 14న ప్రత్యేకమైన సాధారణ సెలవు మంజూరు చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కూటమి విజయానికి ప్రచారం

కోటనందూరు, మే 9: బొద్దవరంలో కూటమి తుని ఎమ్మెల్యే అభ్యర్థి యనమల దివ్య కాకినాడ ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ విజయం కోసం మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్‌బాబు, బీజేపీ కాకినాడ పార్లమెంట్ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు, పెంటకోట భాస్కర్ సత్యనారాయణ, డి.చినబాబురాజు, రమణ, గెడ్డం కొండయ్యనాయుడు, గోపీ, రాజు తదితరులు పాల్గొన్నారు.